"విశాలాంధ్ర" చందా వివరాలు

దిన పత్రిక 12 పైసలు; ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజంటు ద్వారా	పోస్టు ద్వారా
నెలకు	రు. 3.75	రు. 4.25
3 నెలలకు	రు. 11.25	రు 12.75
6 నెలలకు	రు. 22.00	రు. 25.50
సంవత్సరానికి	రు. 44.00	రు. 51.00

VISALAANDHRA Phone 6378
ఉదయం
** Regd. No. H. 203

విశాలాంధ్ర

702629

సంపుటి 17, సంచిక 148 | విజయవాడ 7-9-1967 గురువారం [6 పేజీలు 12 పై.


టెరిలిన్, డెకరాన్, వులన్, కంచి, ధర్మవరం, బెనారస్
పట్టుచీరలకు
మాజేటి రామమోహన్‌రావు
మెయిన్ బజార్
ఫోన్ : 6322

1500 మంది ప్రతినిధులతో

కరీంనగర్ జిల్లా అదనపు భూమిశిస్తు వ్యతిరేక రైతు సదస్సు

కమ్యూనిస్టు, యస్.యస్.పి., మార్క్సిస్టు, జనసంఘ్, కిసాన్ సభ, పురప్రముఖుల ఆధ్వర్యాన

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతిపక్ష ఐక్య కార్యాచరణ అవసరమని శ్రీ వై. వి. కృష్ణారావు ప్రభృతుల ఉద్ఘాటన

హైదరాబాద్, సెప్టెంబరు 6

అదనపు భూమిశిస్తు బిల్లుకు వ్యతిరేకంగా, కరీంనగర్ జిల్లా రైతు సదస్సు నిన్న కరీంనగర్‌లో అత్యంత ఉత్సాహవాతావరణంలో జరిగింది. జిల్లాలోని అన్ని తాలూకాలనుండి 1500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సుకు పార్లమెంటు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ కార్యదర్శి శ్రీ బద్దం యల్లారెడ్డి అధ్యక్షత వహించారు

రైతులపై అధికంగా పన్నులభారం మోపే ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యకార్యాచరణకు పూనుకోవాలని కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రభృతులు ఉద్ఘాటించారు.

ఈ సదస్సును కమ్యూనిస్టు పార్టీ, యస్. యస్. పి. మార్క్సిస్టుపార్టీ, జనసంఘ్, కిసాన్‌సభ, కరీంనగర్‌కు చెందిన కొంతమంది పురప్రముఖులు నిర్వహించారు.

శ్రీ రామలింగయ్య ప్రారంభోత్సవం

యస్. యస్. పి నాయకులు శ్రీ జొన్నలగడ్డ రామలింగయ్య సదస్సును ప్రారంభోత్సవం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలకు నిరసనగా పోరాటం సాగించడానికి ఐక్య కార్యాచరణకు పూనుకోవాలని ఆయన ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

శ్రీ వై. వి. కృష్ణారావు ప్రసంగం

శాసన మండలి సభ్యులు కమ్యూనిస్టు నాయకులు, రైతు నాయకులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రసంగిస్తూ భూమిశిస్తువిధానాన్ని గురించి సుదీర్ఘంగా వివరించారు.

ఆయన యింకా యిలా అన్నారు.

ప్రతి రైతుయొక్క ఆదాయంలోగానీ ఉత్పత్తి చేసేదాంట్లోగానీ, కొంతభాగం ప్రభుత్వం వసూలు చేసే పద్ధతి మను రోజుల్లోమొదలైంది. అయితే ఆధునిక ప్రపంచంలో అదీ 20 వ శతాబ్ది ఉత్తరార్ధంలో, పన్ను విధింపు వాతస్వాతలకు కాలదోషం పట్టిన ఈ రోజుల్లో, ప్రతి పౌరునికి కనీస జీవనస్థాయి కలిగించాలన్న సూత్రాన్ని, అన్ని రాజకీయ పోరాటాలు, ప్రపంచంలోని వివిధ ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు అంగీకరిస్తున్న ఈ రోజుల ఈ విధానం కూడదు.

ప్రస్తుత శిస్తు విధానం, చెల్లించేవారిని కట్టనివ్వకట్టి తయారు చేసిందికాదు. ఇది కాలదోషం పట్టిన భూమిశిస్తు విధానమేగాక అసమానంగా వున్నది దీనినివెంటనే పునర్వ్యవస్థీకరించాలి.

1967 సార్వత్రిక ఎన్నికల తర్వాత, దేశ రాజకీయ చిత్రపటం పూర్తిగామారిపోయింది.

దేశ జనాభాలో అధిక జనాభా వున్న మెజారిటీ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు అధికారానికి వచ్చాయి.

గిట్టుబాటుగాని చిన్న కమతాలపై పన్ను భారం మినహాయిస్తూ ప్రస్తుత భూమిశిస్తు విధానాన్ని కమబద్ధం చేయగలమని అనేక కాంగ్రెసేతర ప్రభుత్వాలు, కొన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు వాగ్దానం చేశాయి.

ఈ పరిస్థితులలో, ప్రతిపక్ష పార్టీల విజ్ఞప్తి, ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చెయ్యకుండా, అదనపు భూమి శిస్తు బిల్లును హడావుడిగా ఆమోదింపచేయడానికి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నిర్ణయించారు. దీనివల్ల 1962 నాటి అదనపు భూమిశిస్తు రెట్టింపు అధికంగా తెలంగాణా ప్రాంతంపై భూమిశిస్తు విధిస్తున్నారు. మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా శాసనసభ సమావేశాన్ని కనీసం యీ నెల 25 నాటికి వాయిదా వేయాలన్న ప్రతిపక్ష సభ్యుల కోర్కెను, కనీసం వినను కూడా వినలేదు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్య ఆందోళన సాగించి, లక్ష్యం సాధించబడేంతవరకూ

(మిగతా 5 వ పేజీలో)

ఛలో అసెంబ్లీ

సెప్టెంబరు 11 ఊరేగింపుకు హైద్రాబాద్ నగర ప్రతిపక్ష పార్టీల నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 6

రాష్ట్రంలోని ఆహార సంక్షోభానికి వ్యతిరేకంగా, భూమిశిస్తు బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ఉద్యోగ పరిస్థితికి నిరసనగా, నగరంలో మంచినీటి పన్ను పెంపు, ఆస్తిని తిరిగిఅంచనావెయ్యడానికి నిరసనగా, సెప్టెంబర్ 11 న రాష్ట్ర శాసనసభకు సంయుక్తంగా ఊరేగింపు జరపాలని, హైద్రాబాద్‌లోని ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు నేడు నిర్ణయించారు.

ఊరేగింపులు చార్మినార్, ముషీరాబాద్, ఖైరతాబాద్, సికిందరాబాద్‌ల నుండి ప్రారంభించి, శాసనసభ గేటుముందు కలుస్తాయి అక్కడ ముఖ్య మంత్రికి మెమొరాండం సమర్పిస్తారు.

పైగాను ప్రాంతాలలోనూ 11 వ తేదీ ముందు బహిరంగసభలు జరుపుతారు. "ఛలో అసెంబ్లీ" అన్న నినాదంతో సెప్టెంబరు 11 నుండి జరిగే రాష్ట్ర వ్యాపిత ఆందోళనలో ప్రజలను సమీకరించడానికి వీలుగా యీ బహిరంగసభలు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ సమావేశానికి శ్రీ యస్. వి. గిరి (శ్రీ జె. వెంకటేశం, మాధవరావు (ఎ. యస్. పి. తరపున) శ్రీ. యల్. మహేంద్ర(కమ్యూనిస్టు) శ్రీ వి. రామారావు (యం. యల్. సి) గంగా శంకర్‌వ్యాస్ (జనసంఘ్) కేశరీసింగ్ భాస్కర్(యస్.యస్.పి.) సలావుద్దీన్ (శాసన సభ్యులు) శ్రీ ఖాజా నిజాముద్దీన్ అహ్మద్, హుస్సేన్(మజ్లిస్) పి లక్ష్మీదాస్(మార్క్సిస్టు) శ్రీమతి ఈశ్వరీబాయ్ (యం. యల్. ఎ. రిపబ్లికన్)

సమావేశానికి జనసంఘ్ నాయకులు శ్రీ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.

దివి తా॥ చల్లపల్లిలో మృతవీరుల స్మారక భవనం

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ రాజేశ్వరరావుచే ప్రారంభోత్సవం

చల్లపల్లి, సెప్టెంబరు 6

కృష్ణాజిల్లా, దివి తాలూకా చల్లపల్లిలో దివి తాలూకా మృతవీరుల స్మారక భవనానికి భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు నిన్న ప్రారంభోత్సవం చేశారు.

గత మూడు దశాబ్దాలుగా కమ్యూనిస్టుపార్టీ నడిపిన అన్ని ఉద్యమాలలోను అగ్రభాగానవుండి ప్రముఖపాత్ర వహించిన పార్టీ కార్యకర్తలు. ఈ కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని కంటికిరెప్పవలె కాపాడిన వందలాది రైతు కూలీ సానుభూతిపరులు, వందలాది పార్టీ కార్యకర్తలు, సభ్యులు 'కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్' 'మృతవీరులకు జోహార్' అని నినాదాలు యిస్తుండగా దివి తాలూకా మృతవీరుల స్మారక భవనానికి కామ్రేడ్ రాజేశ్వరరావు రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. [illegible] ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

అనంతరం పార్టీ తాలూకాలోని స్మృతివీరుల కార్యాలయంలో 42 మంది పేర్లు చిత్రించిన ఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ [illegible] ఎదురునిల్చి ప్రాణాలర్పించిన మృతవీరుల ఫోటోలతో పార్టీ కార్యాలయాన్ని అలంకరించారు.

అనంతరం శ్రీ రాజేశ్వరరావు జండా ప్రతిష్ఠాపన చేశారు. తర్వాత స్థానిక సినిమా హాలులో తాలూకా పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో రాజేశ్వరరావు ప్రసంగించారు.

మృతవీరుల స్మారక భవన నిర్మాణానికి స్థలం యిచ్చిన [illegible] రాజేశ్వరరావు, వారి సతీమణి శ్రీమతి సావిత్రమ్మ, కనూనిసు చంద్ర శేఖర ఆకాష్ రు. 8000/-లు విరాళం యిచ్చారు. స్మారకోత్సవంలో 800 మంది పాల్గొన్నారు.

రాష్ట్రపతి సాగర్ సందర్శన

విజయపురి, సెప్టెంబరు 5

రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్ ఈరోజు నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు.

ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్లు రాష్ట్రపతికి స్వాగతమిచ్చారు.

సాయంత్రం డాముపై శ్రీ హుస్సేన్ సందర్శించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అదనంగా 30 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు, 50 వేల టన్నుల చెరకు ఉత్పత్తి అవుతుందని అంచనా.

ప్రాజెక్టు అద్భుతమైనదిగా వుందని, శ్రీ హుస్సేన్ పత్రికలవారితో మాట్లాడుతూ అన్నారు.

డిప్యూటీ ప్రధాని యూరప్ పర్యటనకు పయనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

డిప్యూటీ ప్రధాని మురార్జీదేశాయి ఈరోజు విదేశీ పర్యటనకు బయలుదేరారు. సుమారు నెలరోజులపాటు, బ్రిటన్, అమెరికా, కెనడా, [illegible], బెల్జియం దేశాలలో ఆయన పర్యటించుతారు.

ఎయిర్‌పోర్టు ఉన్నతాధికారులు, మంత్రులు విమానాశ్రయంలో శ్రీ దేశాయికి వీడ్కోలు యిచ్చారు.

బ్రిటన్‌తో సహా ఆయా దేశాల నాయకులతో చర్చలు జరుపుతానని మురార్జీ విమానాశ్రయంలో పత్రికల వారితో అన్నారు.

ధరలకంట్రోలు పథకంలో మార్పులు

మురార్జీ వివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6

"పేదవాని.ధరలు" స్థిరీకరణ పథకంలో కొన్ని మార్పులు చేయదలిచామని డిప్యూటీ ప్రధాని మురార్జీ ఈరోజు లండన్‌బయలు దేరుతూ పత్రికలవారితో అన్నారు.

వార్షిక కేంద్రబడ్జెట్టు పథకంక్రింద ఎక్కువ నిధులు సేకరించాలని నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందన్నారు.

"ధరల కంట్రోలు పథకం" అంతా మాయమైపోయినట్టు [illegible] కాదని తాను విదేశ పర్యటన ముగించుకొనివచ్చిన తరువాత బ్యాంకులపై సామాజిక కంట్రోలువంటి అంశాలపై తిరిగి మంత్రివర్గం చర్చించుకుంటుందని అన్నారు.

రైల్వే కార్మిక నాయకుని ప్రకటన

పాట్నా, సెప్టెంబరు 6

కేంద్రప్రభుత్వోద్యోగులు పొందుతున్న కరువుభత్యం తమకూ యివ్వాలని రాష్ట్రప్రభుత్వోద్యోగులు చేస్తున్న ఆందోళన న్యాయసమ్మతమైనదని పేర్కొంటూ 'నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్' ప్రధాన కార్యదర్శి శ్రీ పి. వి. శర్మ నేడిక్కడ ఒక ప్రకటన జారీచేశారు.

సెప్టెంబరు 11 న కేరళలో సార్వత్రిక సమ్మె: హర్తాళ్

కేరళ ప్రజలను ఆకలికి గురిచేస్తున్న కేంద్ర విధానానికి నిరసనగా:

తిరువనంతపురం, సెప్టెంబరు 6

ఓనం పండుగ రోజుల్లోగూడా, కేరళ రాష్ట్ర ప్రజలను ఆకలితో మాడ్చుతున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి నిరసనగా, సెప్టెంబర్ 11 న సార్వత్రిక సమ్మె రాష్ట్రవ్యాపిత హర్తాళ్ జరుపాలని ఏడు పాలక పార్టీల ఐక్యసంఘటన సమన్వయ కమిటీ నిశ్చయించింది.

గతరాత్రి జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది. ఈ కమిటీ కన్వీనర్, శ్రీ అతికొడన్ రాఘవన్ నేడు పత్రికల వారికి చెప్పారు.

కేంద్ర విధానానికి నిరసనగా కేరళ ప్రజలు తమ ఆగ్రహావేశాలను ప్రకటిస్తూ శాంతియుతంగా ప్రదర్శనలు చేయగలరని ఆయన అన్నారు.

ఈ సమ్మెలో, కార్మిక సంఘాల కిసాన్ సంస్థల కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వం యన్. జి. వోలు కేంద్ర ప్రభుత్వోద్యోగులు బ్యాంక్ ఉద్యోగులతోసహా అన్ని వర్గాల ప్రజలు ఈ సమ్మెలో పాల్గొనగలరని ఆయన చెప్పారు.

సార్వత్రిక సమ్మెలో మంత్రులుకూడా పాల్గొనగలరనీ, బహిరంగసభలలో ప్రసంగించగలరని ఆయన అన్నారు.

రాష్ట్ర ఉద్యోగుల దేశవ్యాప్త ఆందోళన

జాతీయ సమాఖ్య కార్యవర్గ నిర్ణయం

హైద్రాబాద్, సెప్టెంబరు 5

కరువుభత్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల పట్ల ప్రదర్శిస్తున్న "సవతితల్లి" దృష్టికి నిరసనగా సెప్టెంబరు 23 తేదీన దేశంలోగల 40 లక్షల రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ప్రదర్శనలు, బహిరంగ సభలు జరుపుతారు.

ఇక్కడ జరిగిన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం చేశారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ సమావేశం నిన్నటితో ముగిసింది.

ఈ సమావేశ నిర్ణయాలను సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. రాములు నేడిక్కడ జారీచేసిన ప్రకటనలో వెల్లడించారు.

అయిదుగురు సభ్యులతో కూడిన ప్రతినిధి వర్గం ఒకటి ప్రధాన మంత్రిని, కేంద్ర ఆర్థిక మంత్రిని, హోమ్ మంత్రిని కలుసుకొని, ఈ సమస్యపై రాష్ట్ర ఉద్యోగులలోగల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తుందని ఆ ప్రకటనలో శ్రీ ఎ. రాములు తెలిపారు.

తాజావార్త

కలకత్తా, సెప్టెంబరు 6

సెప్టెంబరు 11న 24 గంటలపాటు సార్వత్రిక సమ్మె, హర్తాళ్ జరుపాలని రాష్ట్రీయ సంగ్రామ సమితి తన నిర్ణయాన్ని ప్రకటించింది.

సెలవు

7 వ తేదీ వినాయకచతుర్థి నాడు 'విశాలాంధ్ర' పత్రికా కార్యాలయానికి సెలవు 8 వ తేదీ పత్రిక వెలువడదు పునర్దర్శనం 9 వ తేదీ

—మేనేజరు,
'విశాలాంధ్ర'.


నేడే విడుదల!
విజయవర్ధన్ మూవీస్
దర్శకత్వం-కూర్పు
T. కృష్ణ. B.A.,
నిర్మాతలు
C. వెంకురెడ్డి-A. రామిరెడ్డి
సంగీతం
K.V. మహదేవన్
ఉపాయంలో అపాయం
రచన: సముద్రాల(జూనియర్)/పాటలు: ఆరుద్ర - ఆత్రేయ - కొసరాజు / కెమెరా: M.K. రాజు
కళ: తోట / కో-డైరెక్టర్: K.V. రావు / నిర్వహణ: పూర్ణచంద్రరావు / నృత్యం: K.S. రెడ్డి
పూర్ణా రిలీజ్
STUDIO Roopkala
NAV RANG

విశాలాంధ్ర

చాగ్లా రాజీనామా

భారత ప్రభుత్వ విద్యావిధానం యెడల అసమ్మతి తెలుపుతూ విదేశాంగ మంత్రి శ్రీ ఎం. సి. చాగ్లా రాజీనామా యిచ్చి, వైదొలగారు. ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీయే విదేశాంగ శాఖను తాత్కాలికంగా నిర్వహించుతుందని ప్రభుత్వ ప్రకటన తెలుపుతోంది.

ప్రధానికి వ్రాసిన రాజీనామా లేఖలో ప్రభుత్వం అనుసరించబోతున్న విద్యావిధానం వల్ల దేశ సమైక్యతకు ప్రమాదం వాటిల్లుతుందన్న ఆందోళనను చాగ్లా వెల్లడించారు. ప్రాంతీయభాషల్లో ఉన్నత విద్యాబోధన, ఇంగ్లీషుస్థానే ఏనాటికైనా హిందీని లింక్‌భాషగా చేయడాన్ని సూత్రప్రాయంగా అంగీకరించుతామన్నారు ఐనప్పటికీ ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్యాబోధనకు పదేళ్ళ కాలపరిమితి ఏర్పర్చడం తొందరపాటు కాగలదనీ, సరైన గ్రంథాలు, తరిఫీదు పొందిన ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యాస్థాయి పడిపోతుందన్న భయాన్ని చాగ్లా వెల్లడించారు

అన్ని స్థాయిల్లో విద్యాబోధనకు ఇంగ్లీషు స్థానాన్ని ప్రాంతీయ భాషలు ఆక్రమించినపుడు "మన ఐకమత్యానికి ఎంతో దోహదం చేసిన భాషాబంధనం తెగిపోతుంద"న్న ఆవేదనను చాగ్లా వ్యక్తం చేశారు

భారత దేశ సమైక్యతకు ఇంగ్లీషు భాషయే కారణమైనట్లుగా చిత్రించడం ఆ భాషయెడల అభిమానమున్న మేధావులకు పరిపాటయింది వాస్తవమదికాదు.

భారతభూమిని బానిసత్వంలో అణచివుంచి ఆర్థికంగా దోచుకున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ భాషనే అన్ని ఉన్నత విద్యాలయాల్లోనూ బోధనా భాషగా ప్రవేశపెట్టారు బ్రిటిష్ పాలనకు అవసరమయిన గుమాస్తాలను, వుద్యోగులను తయారు చేయడమే వారి ప్రధాన ధ్యేయం.

బ్రిటిష్ బానిసత్వాన్నుంచి విముక్తి సాధించేందుకు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతి ఐకమత్యం పెంపొందింది ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్యాబోధన, ఇంగ్లీషు బదులు లింక్ భాషగా హిందీ అన్న సూత్రాలను గాంధీజీ నాయకత్వాన ఆ మహోద్యమమే రూపొందించింది

స్వాతంత్ర్య పోరాటంరోజుల్లో కూడ వివిధ ప్రాంతాల వుద్యమాలను సమన్వయం చేసుకునేందుకు లింక్‌భాషగా ఇంగ్లీషును జాతీయ నాయకత్వం వినియోగించింది, కాని అంతమాత్రంచేత భారత జాతీయ సమైక్యతకు ఇంగ్లీషే కారణమైనట్లుగా చిత్రించడం మాత్రం అతిశయోక్తి అవుతుంది

ఇరవై సంవత్సరాల కాంగ్రెసు పాలనలో ఎన్నో పోరాటాలు త్యాగాల అనంతరమే భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం జరిగింది, మాతృభాషల్లో ఉన్నత విద్యాబోధనకు ఏర్పాట్లు జరుగనే లేదు

స్వాతంత్ర్యోద్యమం చేసిన వాగ్దానం అమలు జరుగకపోవడానికి రెండు ఆటంకాలు వచ్చాయి ఇంగ్లీషుపై మోజున్న మేధావులు విద్యాస్థాయిపడిపోతుందనే సాకుతో ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్యాబోధనను అభ్యంతరం చెప్పారు, హిందీ అభిమానులు ఏనాటికైనా ఇంగ్లీషు స్థానంలో హిందీ లింక్ భాష కావడంతోపాటు ఉన్నత విద్యాబోధనకుసైతం హిందీభాషనే వాడి తీరాలనిపట్టుపడుతూవచ్చారు ఉన్నత విద్యాబోధనకు ప్రాంతీయ భాషల వాడకాన్ని ఉభయులూ సైంధవుల్లా అడ్డుపడ్డారు

హిందీని బలవంతాన రుద్దాలనే ప్రయత్నాలకు దక్షిణ భారతంలోనూ బెంగాల్లోనూ, కూడా వ్యతిరేకత విజృంభించింది ముఖ్యంగా మద్రాసు రాష్ట్రంలో హిందీ వ్యతిరేక వుద్యమంలో పలువురు ఆహుతయ్యారు తర్వాతనే ప్రభుత్వం త్రిభాషా సూత్రాన్ని అంగీకరించక తప్పలేదు

ఇంత చరిత్ర జరిగాక సైతం ప్రాంతీయ భాషలో ఉన్నత విద్యాబోధన ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకించడం సబబుకాదు. భారత దేశ సమైక్యతను దృష్టిలో వుంచుకునే త్రిభాషా సూత్రం రూపొందించబడిందన్న సత్యాన్ని శ్రీ చాగ్లా కాదనలేరు. అన్ని స్థాయిల్లో విద్యాబోధన ప్రాంతీయ భాషల్లో జరిపేందుకు పదేళ్ళ కాలపరిమితి పెట్టడాన్ని తొందరపాటుగా పేర్కొనడం కూడ న్యాయంకాదు స్వాతంత్ర్యమొచ్చి ఇరవైయేళ్ళు గడచినా మాతృభాషలో విద్యా బోధనకు మరో పదేళ్ల గడువుపెట్టడమే సిగ్గుచేటు అసలా సంస్కరణ కూడదనిభావించే వారికి మాత్రమే తొందరపాటుగా కన్పించుతుందేమో ?

అందుచేత త్రిభాషా సూత్రాన్ని అనుసరించి విద్యావిధానం రూపొందించబోతున్న ఈ సమయంలో చాగ్లా రాజీనామా యివ్వడం ఏవిధంగానూ సమర్థనీయంకాదు. ఆయన పొరపడ్డారనే భావిస్తున్నాం.

కాగా మంత్రివర్గం నుండి చాగ్లాను వదలించుకోవాలని ప్రధాని సన్నిహితులుకొందరుప్రయత్నించుతున్నారనే వదంతులు రాజధాని నుంచి కొన్ని వారాలుగా ప్రచారంలో వున్నాయి అందుచేత కేవలం విద్యావిధానంపై విభేదాలే కారణమా ? లేక తదితర కారణాలు దోహదమై చాగ్లా రాజీనామాకు దారితీశాయా అన్న సందేహాలు సహజంగానే కలుగుతాయి

ఖాన్ జాదాలపై నైజాంనవాబు గూండాగిరి

శాసనసభ్యులు శ్రీ ఒవాసీ విమర్శ

హైదరాబాద్, సెప్టెంబరు 5

కీర్తిశేషులైన నైజాంనవాబు అనుమతితో నైజాంకు చెందిన గృహాలలో నివసిస్తున్న సుమారు 2500 మంది ఖాన్‌జాదాలను బేదఖలు చేయడానికి ప్రస్తుత నైజాం గూండా పద్ధతులు అవలంబిస్తున్నారని ఖాన్‌జాదాల సంఘ సలహాదారు, శాసనసభ్యులు శ్రీ సలావుద్దీన్ ఒవాసీ నేడిక్కడ పత్రికా గోష్ఠిలో తీవ్రంగా విమర్శించారు.

ప్రభుత్వం పాలీసా యిచ్చే రు. 20 లక్షల రాజభరణాన్ని నైజాం నవాబు తన సొంతానికి వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. తాను 36 వేలమందిని ఆదుకొని పోషిస్తున్నట్లు నైజాం నవాబు చెబుతున్నది నిజం కాదనికూడ ఆయన అన్నారు

నైజాం నవాబుకు రాజభరణం పూర్తిగా రద్దు చేసినప్పటికీ నష్టమేమీ లేదని, దాని వల్ల ఎవరూ బాధపడరని, పైగా ఆమొత్తాన్ని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు వినియోగించ వచ్చునని శ్రీ ఒవాసీ సూచించారు.

కీర్తిశేషులైన నైజాం నవాబు తనపై ఆధారపడిజీవిస్తున్నవారందరికీ, ప్రస్తుతనైజాం నవాబుతోసహా, ప్రత్యేక ట్రస్టులను ఏర్పాటు చేసి వున్నారని ఆయన వెల్లడించారు.

ఖాన్‌జాదాలు ప్రస్తుతం నివసిస్తున్న గృహాలు తన స్వంత ఆస్తి అన్న విషయం నైజాం నవాబు కావాలంటే కోర్టులలో రుజువు చేసుకోవచ్చునని, అంతే కాని, ఆ గృహాలకు విద్యుత్ సరఫరాను మంచి నీటి సరఫరాను బంద్ చేసి, ఆ ఇళ్ళలో వుంటున్నవారికి లేనిపోని యిబ్బందులు కల్పించటం తగదని శ్రీ ఒవాసీ విమర్శించారు.

కీర్తిశేషులు నైజాం నవాబు ఖాన్‌జాదాలకు యిస్తూ వుండిన అలవెన్సులను పునరుద్ధరించాలని శ్రీ ఒవాసీ డిమాండ్ చేశారు.

క్రైస్తవ మత ప్రపంచ పీఠాధిపతి పోప్‌పాల్ ఈ వారం కాస్తంత నలతగా వున్నారు. ఈ నెల 26 వ తేదీన ఆయనకు 70 ఏళ్ళు వస్తాయి.

సిద్ధాంత సమస్యలపై మార్క్సిస్టు మహానాయకుల గడసాము

గజ్జల మల్లా రెడ్డి

చైనా పిడివాద నాయకుల మంగళాశీర్వాదాలతో విభజన మంత్రాలతో భారత కమ్యూనిస్టుపార్టీ నుంచి చీలిపోయి వేరే మార్క్సిస్టుపార్టీని పెట్టుకున్నవారికి తాము ఇంతవరకూ దేవుడుగా పూజించిన మావో నాయకత్వాన్నే ఖండించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని అనుకోలేదు. కాని, అలాంటి పరిస్థితుల్ని చైనా నాయకత్వమే కల్పించిందనడం వాస్తవం. 'మార్క్సిస్టు' పార్టీ బండికి సోవియట్ వ్యతిరేకత, మావో భజన రెండు చక్రాలుగా ఆదిలోనే అమర్చబడ్డాయి ఇప్పుడు అందులో ఒక చక్రానికి మావో భజన చక్రానికి బ్రేక్ పడితే ఏం జరుగుతుంది? గిరీశం అన్నట్లు డామిట్ కథ అడ్డం తిరిగింది!

పెకింగ్ ఒపేరా ఆర్కెస్ట్రాకు లయతప్పకుండా నృత్యం చేస్తున్న భారతదేశ పిడివాదులకు రాను రాను దుర్భరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కఠోరమైన వాస్తవ జీవితం కరుడు గట్టిన పిడివాదం మాడుపగిలే దెబ్బలు కొట్టింది. ముఖ్యంగా 4 వ జనరల్ ఎన్నికల పరిణామాలు పిడివాదసిద్ధాంతాన్ని బదాబదలుగా చీల్చాయి. పీపుల్సు డెమాక్రసీ తక్షణ ధ్యేయం అనే నినాదంపై తెరదించి ఐక్య సంఘటన ప్రభుత్వాలలో చేరవలసిన పరిణామం వచ్చేసింది. కాంగ్రెసుకు తొత్తులని, రివిజనిస్టులని తిట్టిపోసిన వారితోను అప్పుడప్పుడే కాంగ్రెసు నుంచి బయటికి వచ్చేసిన 'అభ్యుదయ' కాంగ్రెసు వాదులతోను కలిసి ఐక్యసంఘటన మంత్రి వర్గంలో చేరవలసి వచ్చింది. ఒక విధంగా ఇది తప్పించుకోడానికి వీలులేని పరిణామం. పార్టీ లోపల - బయటా వచ్చిన వొత్తిడి ఫలితమే యిది

రింగు మాస్టర్ కొరడా దెబ్బలు

సర్కసులో జంతువు కాస్త ఎడ్డెమతం చూపితే ఏమవుతుంది? రింగు మాస్టర్ కొరడాతో ఎడా పెడా బాదడమే! అదేగతి పట్టింది పెకింగు రింగుమాస్టర్ చేతిలో మన మార్క్సిస్టు సోదరులకు!

ఐక్యసంఘటన ప్రభుత్వాల్లో చేరకపోతే ప్రజలు సహించరు, చేరితే ఏం జరిగింది? అంతవరకూ భారత దేశంలోని పిడివాదులను నిజమైన మార్క్సిస్టు, లెనినిస్టు విప్లవకారుల పార్టీగా తెగపొగిడిన మావోగురుపీఠం భారత దేశంలో నిజమైన కమ్యూనిస్టుపార్టీయే లేదని, కొంతమంది వ్యక్తులు మాత్రమున్నారని తేల్చివేసింది; అంటే "మార్క్సిస్టు" పార్టీకి యిచ్చిన "రికగ్నిషన్‌ను రద్దుచేసింది! అయినా మార్క్సిస్టుపార్టీ నాయకత్వం దొంగకు తేలుకుట్టినట్లు మౌనం వహించింది. ఏదో ఒకవిధంగా ఐక్య సంఘటన ప్రభుత్వాల పీట వదుల్చుకొని మళ్ళీ పెకింగు రింగుమాస్టర్ ప్రశంసలను పొందాలని ప్రయత్నాలు చేయకపోలేదు. కాని, అవి సాధ్యంకాని బాహ్య అంతరంగిక పరిస్థితులు ఏర్పడ్డాయి

నక్సల్‌బరీ అవతరణ

పార్టీని రెండుగా చీల్చడానికి కారణాలుగా మార్క్సిస్టు అగ్ర నాయకులు భారత కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంపై సాగించిన విష ప్రచారం, అంతులేని విప్లవ వాగాడంబరం, చైనా పిడివాద పీఠాధిపతి మావోపై కల్పించిన అంధభక్తి జీర్ణించిన మార్క్సిస్టుపార్టీలోని ఒక వర్గానికి వారి దృష్టిలో రివిజనిస్టులయిన వారితోను, బంగ్లా కాంగ్రెసు నాయకులతో కలిసి మంత్రివర్గంలో చేరడం సహజంగానే పచ్చి అవకాశవాదంగా, అధికార వ్యామోహంగా, విప్లవ విద్రోహంగా కనిపించింది. దానితో నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేసి "నయా రివిజనిస్టు" బిరుదు తగిలించి పోరాట కార్యక్రమానికి పూనుకున్నారు. 1964 లో ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీని చీల్చడానికి తమ గురుపాదులు ఏ "విప్లవ" కార్యక్రమాన్ని అవలంబించారో, అదే కార్యక్రమాన్ని అదే పద్ధతిలో రెట్టింపు పట్టుదలతో కొనసాగించారు.

పార్టీలో ప్రత్యేకమైనపార్టీ స్వంత పత్రిక 'జనశక్తి' లాంటివి, ప్రత్యేక సమావేశాలు, కార్యక్రమం అంతా ఏకచ్ఛత్రంగా చేశారు. అంతేగాదు తమ గురువులు కేవలం నోటితిట్ల విప్లవ వివాదాలతో తృప్తి పడితే స్వవర్గం చిత్త శుద్ధితో 'నక్సల్‌బరీ'ని తయారుచేసింది. అన్ని విధాలా అణచబడిన సంథాల్ రైతాంగంయొక్క న్యాయమైన కోర్కెలకోసం జరిగే పోరాటాన్ని అతివాద దుస్సాహసిక పంథాకు పట్టించింది. దీనితో మార్క్సిస్టుపార్టీ అగ్ర నాయకత్వం యిరుకున పడింది, తమ విప్లవ వాచాలత్వంయొక్క విపరీత పరిణామాన్ని బెదిరిపోయి చూసి, క్రమశిక్షణా ఖడ్గంతో అణచడానికి ప్రయత్నించారు. చివరికి కత్తులు, కటార్లు, నాటుబాంబులతో ఘర్షించే పరిస్థితి వచ్చింది. అప్పుడు మార్క్సిస్టు మహానాయకమ్మన్యుడు శ్రీ రణదివేగారికి పార్టీలో క్రమశిక్షణ, కేంద్రీకృత ప్రజాస్వామ్యం వగైరా గుర్తుకు వచ్చి ఆ అస్త్రాలన్నిటిని సంధించారు. కాని ఏం లాభం? అస్త్రాలయితే సంధించారు, కాని, మంత్రాలు ఎన్నడో అపవిత్రమైనాయి కాబట్టి, వాటి ఎఫెక్టు అంటూ ఏమీ లేకపోయింది. కొటేషన్ల యుద్ధంలో ఆరితేరిన శ్రీ రణదివేకంటే ఆయన నక్సల్‌బరీ శిష్యులు గురువుగారికంటే అయిదాకులు ఎక్కువే చదివారు. మార్క్సు, లెనిన్ గ్రంథాల్లో నుంచి గతంలో రణదివే ఏర్చికూర్చిన ఆ కొటేషన్ల అస్త్రాలనే తిప్పికొట్టారు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష! అని నిగ్గదీశారు - ఈ దెబ్బలతో కంగుతిన్న నాయకత్వం రెచ్చిపోయి నక్సల్‌బరీ నాయకులను సి. ఐ. ఏ ఏజంట్లని నిందించింది.

ఈ దశలో మావో గురుపీఠం నక్సల్‌బరీ బృందాన్ని ఆలింగనం చేసుకొని, తమ సనాతన మార్క్సిస్టు దర్బారుకి వారసులుగా, నిజమైన కమ్యూనిస్టులుగా అంగీకరించి రికగ్నిషన్ యిచ్చేసింది. నక్సల్‌బరీ విప్లవ జ్వాల మావో భావనలోనుంచి పుట్టిందని, భారత విముక్తి యుద్ధానికి నక్సల్‌బరీ నాందీవాచకమని అభివర్ణిస్తూ "మార్క్సిస్టు" నాయకత్వాన్ని, ముఖ్యంగా నంబూద్రిపాద్, జ్యోతిబాసు వగైరా నాయకుల్ని రేడియోద్వారా, పీపుల్సుడైలీ వ్యాసాల ద్వారా తిట్టిపోయడం ప్రారంభించింది. "భారత బడా బూర్జువావర్గం తొత్తులు, సామ్రాజ్యవాదుల ఏజంట్లు, ద్రోహులు" వగైరా, 1962 నుంచి భారత కమ్యూనిస్టు నాయకులైన డాంగే ప్రభృతులను తిట్టినతిట్లే తు. చ. తప్పకుండా తిట్టారు.

ముసుగులో గుద్దులాట

అంతర్జాతీయ సిద్ధాంత సమస్యలపై ఇంతవరకూ కప్పదాట్లువేస్తూ తప్పుకున్న మార్క్సిస్టు నాయకులకు చైనా నాయకత్వం ఆ అవకాశం లేకుండా చేసింది ఏదో ఒకటి తేల్చవలసి వచ్చింది, కాని, ఏం చేయాలి? లౌక్యంలో చాణక్య టెక్నిక్ పుణికి పుచ్చుకున్న శ్రీ బసవపున్నయ్యగారు పాము చావకుండా కర్ర విరుగకుండా వుండే తీరులో చైనా నాయకత్వం అంచనాలతో మా అంచనాలు కొంచెం తేడాగా వున్నాయి. అంటూ "దువ్వటితో తల బద్దలుగొట్టే విమర్శలు చేసి మొక్కుబడి చెల్లించుకున్నారు. కాని, ఆ పార్టీలోని మరీ కరుడుగట్టిన పిడివాద సిద్ధాంత బాబులకు బసవపున్నయ్యగారి లౌక్యంలో వారి సహజాతమైన అవకాశవాదపు దుర్వాసనలు గుబాళించాయి. మరీ అంత ఎక్కువ డోసులో పిడివాద విషం తలకెక్కినవారికి ''అంచనాలలో తేడాలు'' అనడం చాలలేదు.

గడ సాము

యీ పరిస్థితుల్లో కింకర్తవ్యం? పెకింగు నాయకుల కొరడా దెబ్బలతో గాయపడిన తమ నాయకత్వంలోని ఒక వర్గానికి సంతృప్తి కలిగేటట్లుగా చైనాను నిరసించాలి, అదే సమయంలో మావో పేరు ఎత్తుకొని శివాలు తొక్కుతున్న వర్గాన్ని కూడ తృప్తి పర్చాలి ఎంతకష్టమైన గడసాము! అందరికీ సంతృప్తి కలిగించే విధంగా తయారించిన తీర్మానం పూర్తి పాఠంలో ఏముందోగాని, ఆ తీర్మానాన్ని క్లుప్తీకరించి పత్రికలవారికి అందించే రామమూర్తిగారు మాత్రం రోప్‌డ్యాన్సు చేయడంలో చాలాసార్లు బ్యాలెన్సు తప్పారు. అంతేకాదు రామమూర్తిగారు ఒక విధంగా మాటల కోటీశ్వరుడు, అందుచేత చాలా ఉదారంగానే మాటలను ఖర్చుచేశారు. అంతవరకూ కేంద్ర కమిటీ చర్చల వ్యవహారం కోసం నిరీక్షించిన పత్రికేయులకు రామమూర్తిగారి వివరణలో కావలసిన మసాలా దొరికింది. రకరకాల శీర్షికలతో వ్యాఖ్యలతో వార్తలు ప్రచురితమైనాయి. చైనాతో అతివాద కమ్యూనిస్టులు తీవ్రంగా భేదిస్తున్నారని పెద్దగా ప్రచారంసాగిపోయింది.

ఇదీ మదుర సమావేశానికి పూర్వరంగం.

బెంగాల్ ఐక్య సంఘటనలో విభేదాల పరిష్కారం

మంత్రులకు, రాజకీయపార్టీలకు నియమావళుల నిర్ణయం

కలకత్తా సెప్టెంబరు 5

పశ్చిమ బెంగాల్ ఐక్య సంఘటన సమావేశంలో రాష్ట్ర మంత్రులకు, వివిధ రాజకీయ పార్టీలకు రెండు నియమావళులను నేడు ఆమోదించారు ఐక్యసంఘటనలో సంక్షోభం బయలుదేరినదంటూ కొన్ని స్వార్థపరవర్గాలు సాగిస్తున్న ప్రచారంలోని బండారం కాస్తా దీనితో బద్దలైంది.

పశ్చిమ బెంగాల్ ఐక్య సంఘటన నేడిక్కడ ముఖ్యమంత్రి శ్రీ అజయ్ ముఖర్జీ అధ్యక్షతన సమావేశమై, ఐక్య సంఘటన మంత్రులకు ఒక నియమావళిని రూపొందించింది

1. ఏ మంత్రి అయినా సరే అధికార విధానాలపై ప్రకటన చేసినప్పుడు మొత్తం ప్రభుత్వ అభిప్రాయాలను మాత్రమే వ్యక్తం చేయాలి.

(2) మంత్రివర్గ నిర్ణయాలకు మంత్రులంతా బాధ్యులు. మంత్రివర్గ నిర్ణయాలను ఏ మంత్రి బహిరంగంగా వ్యతిరేకించకూడదు అంతేకాదు, ఆ నిర్ణయాలను ప్రతి మంత్రి బలపర్చాలి.

3. ఒకానొకమంత్రి ఒక నిర్ణయంచేసినప్పుడు మంత్రివర్గ సమావేశానికి హాజరుకాని సందర్భాలలో సైతం, ఆయన ఆ నిర్ణయాన్ని బహిరంగంగా బలపర్చుతూనే, కావాలంటే మంత్రివర్గ సమావేశంలో ఆ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరవచ్చు.

4. ఒక ముఖ్యమైన సమస్యపై తీవ్రమైన విభేదాలు వున్నప్పుడు, మంత్రివర్గం దానిపై తన నిర్ణయాన్ని వాయిదా వేయవచ్చు అలాంటి సందర్భంలో ఆ సమస్యపై వివిధ మంత్రులు తమ అభిప్రాయాలను నిర్మాణాత్మక పద్ధతిలో, ప్రభుత్వాన్నిగాని, ఇతర మంత్రులను గాని విమర్శించకుండా బహిరంగ ప్రకటనలు చేయవచ్చు.

5. ఐక్య సంఘటన ఆమోదించిన 18 అంశాల కార్యక్రమానికి విరుద్ధమైన ప్రకటనలను గాని, చర్యలను గాని ఏ మంత్రి చేయరాదు.

6. మంత్రివర్గ నిర్ణయానికిగాని ఐక్య సంఘటన కార్యక్రమానికిగాని విరుద్ధంగా ఒక మంత్రిప్రకటన చేశారని మరొకమంత్రి అభిప్రాయపడితే, అలా అభిప్రాయ పడిన మంత్రి ఆ సమస్యను మంత్రివర్గంలోచర్చకు పెట్టాలి. అదివెంటనే సాధ్యంకాని పరిస్థితిలో దానిని ముఖ్యమంత్రి దృష్టికి తేవాలి. అంతేకాని తోటి మంత్రిని విమర్శిస్తూ మరొక ప్రకటన చేయరాదు.

నేటి సమావేశానికి ఐక్యసంఘటనలోని 14 పార్టీల ప్రతినిధులు, ఇద్దరు మినహా మిగతా 17 మంది మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు, పార్లమెంటు సభ్యులు శ్రీ సమరగుహా హాజరయ్యారు.

నేటి సమావేశంలో ఈ పార్టీలుకూడా ఒక నియమావళిని రూపొందించారు. వరదలు, రాష్ట్రంలోని ఆహార పరిస్థితిపైన కూడా చర్చించారు.

ఈ చర్చలు సుహృద్భావ పూర్వకమైన వాతావరణంలో జరిగినవని ఐక్య సంఘటన ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

రాజకీయ పార్టీలకు నియమావళి

మంత్రివర్గనిర్ణయాలపైన ప్రభుత్వవిధానాలపైన ఐక్య సంఘటనలోని వివిధ రాజకీయ పక్షాలు ఎటువంటి వైఖరి అవలంబించవచ్చునో పేర్కొంటూ నేటి సమావేశంలో ఒక నియమావళిని రూపొందించారు.

ఐక్య సంఘటన ఆదేశం ప్రకారం నిర్ణయానుసారం ఐక్య సంఘటన ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రధానమైన నిర్ణయాలన్నింటినీ ముఖ్యమైన చర్యలన్నింటినీ ఐక్య సంఘటన నిర్ణయిస్తుంది. వాటిని ఐక్యసంఘటన ప్రభుత్వం అమలు జరుపుతుంది.

ప్రభుత్వ విధానాలకు సంబంధించిన సకల విషయాలు ఐక్య సంఘటనలో చర్చించాలి

ఐక్యసంఘటన, దానిలోని పార్టీలు ఎల్లప్పుడూ ప్రభుత్వ విధానాలను, మంత్రివర్గ నిర్ణయాలను సమర్థించాలి.

ఐతే, ఐక్యసంఘటనలోని పక్షాలు మంత్రివర్గ నిర్ణయాలను చిత్తశుద్ధితో, స్నేహపూర్వకంగా, నిర్మాణాత్మకంగా విమర్శించే హక్కులను కలిగి ఉంటాయి ఆ విమర్శలో ఐక్యం ప్రభుత్వానికి బలం చేకూర్చేదిగా వుండాలి. ఏ మంత్రినిగాని, ఏ పార్టీనిగాని దుయ్యబట్టేదిగా, కించపరిచేదిగా ఆ విమర్శలో వుండరాదు.

ఐక్యసంఘటన సమావేశం రేపు, ఎల్లుండి కూడా కొనసాగుతుంది. ఆహార సమస్యపై తుదినిర్ణయం చేస్తారు.

సెప్టెంబరు 11 న సార్వత్రిక సమ్మెకు రాష్ట్రీయ సంగ్రామ సమితి యిచ్చిన పిలుపుపై కూడా ఐక్యసంఘటన చర్చిస్తుంది.

ధాన్యం సేకరణకు వాలంటీరు దళాలు

బెంగాల్ కమ్యూనిస్టు సమితి పథకం

కలకత్తా సెప్టెంబరు 5

పోలీసుల సహకారంతో దొంగ నిల్వలను బయటికి లాగటానికి, ధాన్య సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయటానికి, రాష్ట్ర ప్రభుత్వం, ఐక్యసంఘటన కమిటీలుకలిసి వాలంటీరు దళాలను ఏర్పాటుచేయాలని. ఆ దళాలకు కొన్ని అధికారాలు యివ్వాలని బెంగాల్ కమ్యూనిస్టు సమితి ఈ రోజు సూచించింది.

గత మూడు రోజులుగా సమావేశమవుతున్న రాష్ట్ర సమితి, కొత్త పంట తరుణంలో ధాన్యం సేకరణకు 10 అంశాల కార్యక్రమాన్ని ఆమోదించింది.

టోకువ్యాపారులకు ఉత్పత్తిదార్లు ధాన్యం అమ్మకుండా నిషేధించి. ఆహార కార్పొరేషన్, సహకార సంస్థలద్వారా నవంబరు నుంచి ఫిబ్రవరివరకు ప్రభుత్వమే ధాన్యం కొనాలని సూచించింది. మిగులు జిల్లాలనుండి ధాన్యం తరలించబడకుండా కట్టుదిట్టాలు చేయాలని కోరింది.

పంచదార పర్మిట్లు

(3 వ పేజీ తరువాయి)

పైగా పంచదార అవసరం లేనివారు దరఖాస్తులు యిచ్చి పర్మిట్లు పుచ్చుకొని ఆ పంచదార, బియ్యం, మైదా లను హోటలు యజమానులకు, వర్తకులకు చేరవేస్తున్నారు.

మహిళల అవస్థ

పంచదార అవసరం ఉన్నటువంటి మహిళలు మలమల మాడుతున్న ఎండలో వరుసలో నిలబడి పంచదార పర్మిట్లకోసం పడిగాపులు పడటం హృదయ విదారకరంగా ఉన్నది. గర్భిణీ స్త్రీలు, చంటిబిడ్డలను సైతం చంకనిడుకొన్న స్త్రీలు సైతం వరుసలో ఉన్నారు.

గతంలో పండుగలు వచ్చిన సందర్భంలో పంచదార కార్డులపై బియ్యం, పంచదార, మైదా, రవ్వ తదితర కంట్రోలు సరకులను ప్రజలందరికీ సరఫరాచేసే పద్ధతి ఉండేది. కాని ఈసారి రెండు వేలమందికి ప్రత్యేకపర్మిట్లు యిస్తామని నిర్ణయించి దొంగ పర్మిట్లదార్లకు అవకాశం కలిగించే పద్ధతిని విజయవాడ సివిల్ సప్లయి అధికారులు, సబ్‌కలెక్టరు ఎందుకు చేబట్టారో అగమ్య గోచరంగా ఉన్నది.

పట్టణంలో 30 ఏ.సి.సి. స్టోర్సుడిపోలు, 300 బియ్యం డిపోలు ఉన్నాయి. ఆ డిపోలు పంచదార తదితర కంట్రోలు వస్తువులసరఫరాచేసి పంచదార కార్డులపై యిస్తే ప్రజలందరికీ ఈ సరుకులు లభ్యమయి వుండేవి.

ప్రస్తుతం ఏ. సి. సి. స్టోర్సులో నున్న పంచదార 900 మందికి మాత్రమే సరిపోతుంది. కాని నేటి మధ్యాహ్నం 1.30 గంటలకు 1200 మందికి పర్మిట్లు జారీ చేశారు. యింకా 15 వందల మంది వరుసలో నిలబడి ఉన్నారు. పంచదార తదితర వస్తువుల నిల్వలు యెంత ఉన్నదీ అంచనా లేకుండా వేలాది ప్రజలకు పర్మిట్లు యిచ్చి పత్రికలలో వేయించుకొని ఘనత సంపాదించడానికి ఒక పద్ధతి. క్రమం లేని కార్యక్రమాన్ని సాగిస్తున్నారని అర్థం అవుతున్నది.

విజయవాడ సబ్‌కలెక్టరు, సివిల్ సప్లయి అధికారులు చేబట్టిన ఈ వైఖరిని ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు.

మావో ముఠాపై ఇన్నర్ మంగోలియా తిరుగుబాటు

టోకియో. సెప్టెంబరు 5

మావో ముఠా పాలనను చైనాలోని స్వయం పాలిత రాష్ట్రమైన ఇన్నర్ మంగోలియా నాయకులు ఉలాన్‌ఫూ ప్రతిఘటిస్తున్నారని పెకింగ్ రేడియో ప్రసారంలో విమర్శించారు.

ఉలాన్‌ఫూ జాతి వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని పెకింగ్ రేడియో ఆరోపిస్తున్నది.

చైనాలోని మెజారిటీ జాతి అయిన హాన్ జాతీయులను మావో ముఠా పెద్ద సంఖ్యలో ఇన్నర్ మంగోలియాకు తరలించి, అల్ప సంఖ్యాక మంగోలియన్ జాతిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నదని. దీనిని మంగోలియన్ జాతి ప్రజలు నిరసిస్తున్నారని ఇంతకుముందు అనేక వార్తలు వచ్చాయి. ఆ వార్తలు నిజమని ఇప్పుడు పెకింగ్ రేడియో ప్రసారంవల్ల ధ్రువపడుతున్నది.

ఉలాన్‌ఫూ చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ సభ్యులు; పార్టీ పొలిట్‌బ్యూరో ప్రత్యామ్నాయ సభ్యులు. ఇన్నర్ మంగోలియా కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి.

ఈ రేడియో ప్రసారాన్నిబట్టి. ఇన్నర్ మంగోలియా ఇప్పుడు మావో ముఠా అదుపాజ్ఞలలో నుంచి జారిపోయినట్లు భావించవచ్చునని జపానులోని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

సభలు-సమావేశాలు

కాళహస్తితాలూకా వ్యవసాయ కూలీ మహాసభ కాళహస్తిలో సెప్టెంబరు 11వ తేదీన జరుగుతుంది. యీ మహాసభకు దాదాపు 30 గ్రామాలనుండి ప్రతినిధులు హాజరు కాబోవుచున్నారు.

రాష్ట్రవ్యవసాయ కూలీసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ గుజ్జుల ఎల్లమందారెడ్డి, శాసన సభ్యులు శ్రీ జె. శివయ్య, జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. కృష్ణారెడ్డి గారు యీ మహాసభలో పాల్గొంటారు.

* * * *

8 వ తేదీన (శుక్రవారం) భీమవరంలో భీమవరం తాలూకా కమ్యూనిస్టు పార్టీ సమితి కార్యవర్గ సమావేశం జరుగుతుంది. జిల్లా పార్టీ కార్యదర్శి కవర్ధిగారుకూడ హాజరవుతున్నారు. కార్యవర్గ సభ్యులు హాజరుకావలసినదిగా తా॥ క॥ సమితి కార్యదర్శి శ్రీ పోలిశెట్టి కోరుతున్నారు.

ఆర్థిక సమస్యలపై మంత్రివర్గ చర్చలు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

బ్యాంకులపై సామాజిక కంట్రోలు వగైరా ముఖ్య ఆర్థిక సమస్యల గురించి చర్చలను ప్రస్తుతానికి వాయిదా వేయాలని కేంద్ర మంత్రివర్గం నిన్న నిర్ణయించింది.

వేతన స్తంభనకు ఉద్యోగులు అంగీకరించనిదృష్ట్యా 'వేతనాలు, లాభాలు, ధరలు' స్తంభన పథకం అమలుకు వీలు కాదని, ఈ ఏడాది పంటలు బాగుండే సూచనలు కన్పిస్తున్నదృష్ట్యా, రెండు మూడు నెలలలో చేతినిండా తిండిగింజలు లభ్యమయితే చాలాసమస్యలు వాటంతటవే పరిష్కారం అవుతాయనీ అందువల్ల ప్రస్తుతానికి తీవ్ర ఆర్థిక చర్యల గురించి ఆలోచించటం అనవసరమని మంత్రివర్గం నిర్ణయించింది.

మురార్జీదేశాయ్ పశ్చిమ దేశాల పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన తరువాత, బ్యాంకులపై సామాజిక అజమాయిషీ వగైరా అంశాల గురించి చర్చించ వచ్చునని భావించింది

అక్టోబరులో జరిగే ఏ. ఐ. సి. సి. సమావేశంలో ఈ సమస్యలు ప్రధాన పాత్ర వహించే అవకాశం వున్నందున ఆలోగా కాంగ్రెస్ కార్యవర్గం వివరంగా పరిశీలన జరపాలని కేంద్ర కాంగ్రెసు నాయకులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

శ్రీ దేశాయి విదేశీ పర్యటన అయిన తర్వాతనయితే విదేశీ సాయం పరిస్థితి కూడా చాలావరకు తెలుస్తుందని వీరంటున్నారు.

నూనె కమిషన్ ఉద్యోగుల సమ్మె సంకల్పం

బరోడా సెప్టెంబరు 5

ఈ నెల రెండవ వారంలో నూనె, సహజ వాయువుల కమిషన్ ఉద్యోగులు నిరవధిక సమ్మె ప్రారంభించటానికి సంకల్పించారు

ఉద్యోగుల కార్యాచరణ కమిటీ ఈ నిర్ణయంచేసింది.

కార్మికుల సమ్మె నిర్ణయం బాధ్యతా రహితమైనదనీ దేశార్థిక వ్యవస్థను చిక్కుల పాలు చేస్తుందని కమిషన్ ఈ రోజు ప్రకటించింది.

కార్మికుల ఇబ్బందుల పరిష్కారానికి మేనేజిమెంటు శ్రద్ధ చూపిస్తుండగా యూనియన్ సమ్మెకు తలపడటం అనుచితమని విమర్శించింది.

గత రెండేళ్ళుగా శాంతియుత సంప్రదింపులద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ చేసిన యత్నాలు విఫలమయినందున ఈ తీవ్రచర్యకు ఉపక్రమించవలసివచ్చిందని యూనియన్ అధ్యక్షులు ప్రకటించారు.

బీహార్ మాజీ మంత్రులపై దర్యాప్తుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అంగీకారం

పాట్నా, సెప్టెంబరు 5

బీహార్ కాంగ్రెస్ మాజీ మంత్రులపై గల అవినీతి ఆరోపణల గురించి దర్యాప్తు జరపటానికి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు అంగీకరించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి మహామాయప్రసాద్‌సిన్హా ఈరోజు ప్రకటించారు

ఈ రోజు ఉదయం రాంచీ వెళ్ళిన ముఖ్యమంత్రి సాయంత్రానికి పాట్నా తిరిగి వచ్చారు.

రాంచీ ఘటనలపై దర్యాప్తుకు హైకోర్టు న్యాయమూర్తులలో ఒకరిని ఇవ్వటానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారని ఆయన అన్నారు.

బీహార్ మంత్రివర్గంపట్ల జనకాంగ్రెస్ విశ్వాసం

బీహార్ ఐక్యసంఘటన మంత్రివర్గం పడిపోతుందని తాను భావించటంలేదని జనకాంగ్రెస్‌నాయకుడు హరేకృష్ణమెహతాబ్ అన్నారు.

బీహార్‌లో కాంగ్రెస్ అనుసరించుతున్న పంథా 'వట్టి అవకాశవాదం' అని విమర్శించారు.

జనరల్ ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కాంగ్రెసు పరిస్థితి అధ్వాన్నంగా వుందని చెప్పారు.

ఇదిలావుండగా సెప్టెంబరు 8 వ తేదీన తాము రాష్ట్రగవర్నర్‌ను కలుసుకోబోతున్నామని 'కాంగ్రెసు' శోషిత్‌దళ్ నాయకుడు శ్రీ మండల్ ఈరోజు ప్రకటించారు.

"ఐక్య సంఘటన పక్షమూ, కాంగ్రెసు- శోషిత్ దళ్ పక్షమూ తమ తమ బలాబలాల సమీకరణలో పూర్తిగా నిమగ్నమైవున్నాయి.

బీహార్‌లో ఆహారధాన్యాల ధర తగ్గుముఖం

పాట్నా, సెప్టెంబరు 5

పప్పుధాన్యాలు మినహా అన్ని ఆహార పదార్థాల ధరలు రాష్ట్రంలో తగ్గుముఖం పట్టాయని బీహార్ ఆహారమంత్రి శ్రీ కపిలదేవ్‌సింగ్ ఈరోజు చెప్పారు.

బియ్యం ధర గత రెండు వారాల్లో క్వింటాల్‌కు 20 రూపాయలు తగ్గింది.

సాధారణంగా ఆగస్టు-సెప్టెంబరు నెలలో తిండి గింజలు పెరగటం మామూలు, కాని అందుకు విరుద్ధంగా ఇప్పుడు తగ్గుతున్నాయి.

పెద్ద భూస్వాముల వద్దనుండి, దొంగ నిల్వదారుల నుండి ధాన్యాన్ని స్వాధీనం చేసుకొనే కార్యక్రమం నిరవధికంగా కొనసాగుతుందని మంత్రి అన్నారు.

రాష్ట్రంలోని భూస్వాములు, వ్యాపారులపై జరిపిన 900 దాడులలో 67 వేల క్వింటాల్స్ ధాన్యాలు దొరికాయి. 27 గురు వ్యాపారులను డిఫెన్స్ శాసనం క్రింద నిర్బంధంలో వుంచారు.

కరువుపనుల్లో భాగంగా కాయకష్టం చేసే వారి ఆహారంకోసం రు.8.60 కోట్లు రాష్ట్రంలో ఖర్చుపెట్టామని అన్నారు.

గ్రామీణ ప్రజలకు దూరమవుతున్న మేధావి వర్గం

విద్యామంత్రి విచారం

హైదరాబాదు, సెప్టెంబరు 5

నేడు దేశంలోని మేధావులు ప్రజలనుండి, జనాభాలో ఎక్కువ భాగం నివసిస్తున్న గ్రామీణ ప్రాంతాల నుండి వేరుపడిపోతున్నారని కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ త్రిగుణసేన్ నిన్న ఇక్కడ అన్నారు. భారత అంతర్జాతీయ కేంద్రానికి ప్రారంభోత్సవం జరుపుతూ శ్రీ సేన్ పై అభిప్రాయం వెలిబుచ్చారు.

దేశంలో నేడు చదువుకున్నవారు గ్రామాల నుంచి పట్టణాలకూ, పట్టణాలనుండి నగరాలకూ, చివరకు మేధావుల నిలయం అని భావించబడుతున్న ఢిల్లీకి చేరుకోవాలని ప్రయత్నిస్తున్నారని, నేటి విద్యా విధానంలోని అన్ని మార్గాలూ ఈ విధంగా ప్రయత్నించటానికే తోడ్పడుతున్నాయనీ ఆయన అన్నారు. ఈ విధమైన పద్ధతిలో మనం దేశాన్ని ముందుకు తీసుకుపోలేమని, చదువుకున్న వారు ప్రజలతోనూ, గ్రామీణ జీవితంతోనూ నిత్య సంబంధాలు కలిగి వారికి తోడ్పడుతున్నప్పుడే దేశ పురోగతి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

భారత, అంతర్జాతీయ కేంద్రం అధ్యక్షులు శ్రీ సి. డి. దేశ్‌ముఖ్, ఆయన భార్య హైదరాబాదులో చేస్తున్న ప్రయోగాల కృషి చాలా ఆవశ్యకమైనదని తాను భావిస్తున్నట్లు శ్రీ సేన్ అన్నారు.

తాత్కాలిక పోస్టుల్లో ఉద్యోగులకు జీతాలు బంద్

ప్రభుత్వం తుగ్లక్ ఫర్మానా

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు, సెప్టెంబర్ 4

తాత్కాలిక పోస్టులలో (టెంపరరీ ఎస్టాబ్లిష్‌మెంట్సు) పనిజేసే ప్రభుత్వ సిబ్బందికి సెప్టెంబర్ ఒకటవ తేదీన ముట్టవలసిన జీతాలను, అలవెన్సులను చెల్లించవద్దని ప్రభుత్వం అన్ని ట్రెజరీలకు ఉత్తర్వు జారీ జేసింది.

ఫలితంగా వివిధ డిపార్టు మెంటులకు చెందిన ఆఫీసులలో అత్యధిక సంఖ్యలో వున్న తాత్కాలిక పోస్టులలో పని జేస్తున్న సిబ్బందికి జీతాలు ముట్టక బాధలకు గురి కావల్సివచ్చింది.

ఉద్యోగుల సర్వీస్ పర్మినెంటు అయినా, పనిజేసే పోస్టులు తాత్కాలికమైనవైతే, ప్రతి సంవత్సరం ఆ తాత్కాలిక పోస్టులకు పొడిగింపు ఉత్తర్వులు సకాలంలో రాకపోతే, ఆ పర్మనెంటు ఉద్యోగులకు కూడా జీతాలు చెల్లించడం జరగదు. వరుసగా మూడు సంవత్సరాలు ఈ తాత్కాలిక పోస్టులు కొనసాగింపు జరిగితే ఆ పోస్టులను పర్మినెంటు చేయవలసిన బాధ్యతను ప్రభుత్వం పాటించదు. పోనీ తాత్కాలిక పోస్టులకు పొడిగింపు ఉత్తర్వులనైనా సకాలంలో జారీచేసి ఉద్యోగులకుజీతాల చెల్లింపుకి ఆటంకంలేకుండా చూడదు

ప్రభుత్వం నుండి ఈ తరహా పోస్టుల పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయుటలో జరిగే జాప్యాన్ని నివారించేందుకు వివిధ డిపార్టుమెంటు అధికారులకు ఇచ్చిన అధికారాలను పునస్సమీక్షించుకొని తాత్కాలికంగా, ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేలోపున ఆయా డిపార్టుమెంటుల అధికారులు ఆరు నెలలపాటు పోస్టులను పొడిగించే అధికారం కలిగియుండేవారు. ఒక ఉత్తరువు ద్వారా ప్రభుత్వం వారి యీ అధికారాన్ని కూడా లాగివేసింది.

ప్రభుత్వం జారీచేసిన జీ. వో. 159 లో ప్రభుత్వం వివిధ డిపార్టుమెంటులకు ఇచ్చిన ఆదేశాలను పాటించక, ఆయా డిపార్టు మెంటులు తాత్కాలిక పోస్టులను పొడిగించడం జరుగుతున్నది గనుక డిపార్టుమెంటు అధికారులకు ఇచ్చిన అధికారాలను రద్దు పరచడం జరిగిందని యిందులో పేర్కొంది.

త్రిగుణసేన్ ఢిల్లీపయనం

హైదరాబాద్, సెప్టెంబరు 6

హైదరాబాద్ కార్యక్రమాలు ముగించుకుని కేంద్రమంత్రి త్రిగుణసేన్ ఈ రోజు సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు.

ఉత్తర ప్రదేశ్, ఒరిస్సాలలో వరదల బీభత్సం

వేలాది ఎకరాలలో పంటలకు తీవ్ర నష్టం

60 మందికి పైగా మృతి: 35 వేలకు పైగా ఇండ్లు ధ్వంసమైనట్లు వార్త

విజయవాడ సెప్టెంబరు 5

ఉత్తరప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలోని నదులుపొంగి భారీ యెత్తున వరదలు సంభవించి వేలాది ఎకరాల పంటభూములు నీట మునిగాయి ఈ యేడాది పంటలు బాగా ఉన్నాయని రైతులు సంతృప్తి చెందుతున్న సమయంలో ఈ రకంగా వరదలు రావడం రైతాంగాన్ని దుఃఖ సముద్రంలో ముంచెత్తినట్లయింది ఉత్తర ప్రదేశ్‌లో వరదలఫలితంగా 61 మంది మృతిజెందారు 265 పశువులు మరణించాయి 35 వేల నివాస గృహాలు ధ్వంసమయ్యాయని నేడిక్కడకు అందిన వార్తలు తెలిపాయి.

మొత్తం 29 జిల్లాలు ఈ వరదలకు గురయ్యాయి. ఈ జిల్లాలలో 10,98 లక్షల ప్రజలు వరద ప్రమాదాలకు గురయ్యారు. మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా ఈ వరద ప్రమాదానికి గురయ్యాయి. మధ్యప్రదేశ్‌లో బుందేల్‌ఖండ్ ప్రాంతంలో 13 మంది ప్రాణాలను వరదలు పొట్టన బెట్టుకున్నాయి. 3.77 లక్షల ఎకరాల పంట భూములు మునిగి పోయ్యాయి.

బుందేల్‌ఖండ్ ప్రాంతంలో కుంభవృష్టి కారణంగా బెత్వా, పహూజ్, దాసన్, జామ్ని, ఛేన్ నదులకు వరదలు వచ్చాయి

అధికారులు ఆ ప్రాంతాలకు సైన్యాన్ని తరలించారు.

సికంద్రాబాద్, ఖూర్జా తహశీల్ ప్రాంతాలలో 500 గ్రామాలు వరద ప్రవాహానికి గురయ్యాయి. 1,10,000 ఎకరాల భూమి నీట మునిగింది.

ఆ ప్రాంతాలకు వెళ్ళిన సైన్యం గ్రామీణులను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో 8 మంది మృతి జెందారని, 13 పశువులు మరణించాయని జిల్లామేజిస్ట్రేటు గత రాత్రి ప్రకటించారు.

సైనిక వైద్యుల రాక

ప్రమాదానికి గురైన గ్రామీణులకు వైద్య సహాయం చేయడానికి సైనిక వైద్యులు వచ్చారని, నీరు నిల్వఉండిన ప్రాంతాలలోని నీటిని తోడే కార్యక్రమం సాగుతున్నదని ఆయన తెలిపారు.

11 గ్రామాలలో నీరు నిల్వ ఉన్నదని. మొత్తంపైన ఈవరదలకు 7,500 గ్రామాలు గురయ్యాయని ఆయన చెప్పారు.

మధురజిల్లాలో 1.47లక్షలఎకరాలపంట భూమి నీటమునిగింది. ఆగ్రా ప్రాంతంలో 91 వేల ఎకరాల భూమి మునిగిపోయింది. కాన్పూర్ ప్రాంతంలో 70 వేల ఎకరాల భూమి వరదలపాలయింది.

యమునా, సెగర్, సిన్ద్, కాళీ నదుల నీటి మట్టం పెరుగుతున్నదని నేడిక్కడకు అందిన వార్తలు తెలుపుతున్నాయి.

తూర్పు ప్రాంతంలోని గంగా, గ్రాగ నదుల వరదలు తగ్గుముఖం పడుతున్నాయి.

ఒరిస్సాలో వరదల ఉధృతి

జైపూరు సమీపంలోని వైతరణీనది పొంగిన ఫలితంగా జగన్నాథ దేవాలయం లోనికి నీరు ప్రవేశించింది.

బ్రాహ్మణి నది నీటి మట్టం 25.9 అడుగుల నేటి సాయంత్రానికి చేరుకున్నది. ఈ నది మట్టం త్వరితంగా పెరుగుతుండడం మూలంగా కటక్ జిల్లాలోని కేంద్ర పాలిత ప్రాంతానికి ప్రమాదం యేర్పడే సూచనలు కన్పిస్తున్నాయి.

మయూర్‌భంజ్ జిల్లాలో వరదలు తగ్గుముఖం పట్టాయి. బలాసోర్, బరిపదమధ్య యున్న జాతీయ రహదారి మునిగిపోయింది.

వరద ప్రాంతాలలో సహాయక కార్యక్రమాలు సాగించడానికి సైనిక సహాయం అవసరం అని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

ప. బెంగాల్‌లో వరదలు

ఇల్లు కూలి స్త్రీ మరణం

కలకత్తా, సెప్టెంబరు 4

మిడ్నపూర్ జిల్లా బ్రైనాలో ఒక ఇల్లు కూలటం మూలంగా ఒక స్త్రీ మరణించిందని తెలుస్తోంది.

కొంటాయ్‌లోని వరదపరిస్థితిలో మార్పు లేదు. 3 వేలమంది నిరాశ్రయులకు పాఠశాలలలో నివాసం కల్పించబడ్డది.

కొశియానది నీటిమట్టం పెరుగుతోందని, రోడ్డు రవాణాలు తెగిపోయినవని తెలుస్తోంది.

8 గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. మురికి వాడలలోని అనేకమైన ఇళ్ళు నేలమట్టమైపోయాయి

వరద బాధితుల సంరక్షణార్థం రాష్ట్ర ప్రభుత్వం సహాయక ఏర్పాట్లు చేస్తోంది. దామోదర లోయ కార్పొరేషను నుండి నీరు వదలవద్దని ప్రభుత్వం సంస్థ అధికార్లను కోరింది.

ఆగ్నేయ రైల్వేలో రైళ్ళ రాకపోకలు

కలకత్తా, సెప్టెంబరు 5

ఆగ్నేయ రైల్వేలోని తూర్పు తీర సెక్షన్‌లో రైళ్ళ రాకపోకలను నేటి ఉదయం తిరిగి పునరుద్ధరించారు.

గత ఆదివారంనుండి వరదలకారణంగా ఈ సెక్షన్‌లో రైలుబండ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

హౌరా, నాగపూర్ మెయిలుకోసం రైలు బండ్ల రాకపోకలను పునఃప్రారంభించడానికి సన్నాహాలు చేశారు.

మహీ నదిలో 12 మందికి పైగా మృతి

పడవ బోల్తాపడిన ఫలితంగా

సోనేపూర్, సెప్టెంబరు 5

మహీ నది ఉధృతంగా పొంగినఫలితంగా 12 మందికి పైగా ప్రయాణీకులు మునిగి మృతిజెందారని నేడిక్కడకు చేరిన వార్తలు తెలియజేశాయి.

ఆ నదిలో 24 మందికి పైగా ఉన్న ప్రయాణీకులతో వెళుతున్న పడవ బోల్తాపడిన ఫలితంగా ఈ ఘటన జరిగింది.

మునిగిపోయినవారిలో ముగ్గురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. మిగతావారికోసం గాలిస్తున్నారు.

పారిశ్రామిక భద్రతాపథకాల బిల్లు

వివిధ సంస్థలనుంచి అభిప్రాయ సేకరణకు సెలక్టు కమిటీ నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4

కేంద్ర పారిశ్రామిక భద్రతాపథకాల బిల్లు గురించి వివిధ సంస్థలు, పరిశ్రమాధిపతుల అభిప్రాయాలను తెలుసుకోవాలని పార్లమెంటు జాయింట్ సెలెక్టు కమిటీ నిర్ణయించింది.

కేంద్ర ప్రభుత్వ అధ్వర్యానగల పరిశ్రమలు, సంస్థల భద్రతకు ప్రత్యేక రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయడానికి ఈ బిల్లు వల్ల ప్రభుత్వానికి అధికారం దఖలుపడుతుంది. ప్రైవేటు రంగంలోని వివిధ పరిశ్రమలు, సంస్థలు కూడా ఇటువంటి సిబ్బందిని స్వంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవచ్చు.

వేతన స్తంభన ప్రతిపాదనకు సమాధి

ఉద్యోగులసంఘ నాయకుల ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

కేంద్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితికి, ప్రభుత్వానికి జరిగిన ఒప్పందం ప్రకారం వేతన స్తంభన, అంతిమంగా సమాధి చేయబడటం, వేతనంలో కోతపెట్టాలన్న గజేంద్రగడ్కర్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వమూ, ఉద్యోగుల సంఘాలుకూడా త్రోసిపుచ్చటమూ అనే రెండు ప్రయోజనాలు సిద్ధించాయి. ఈ విషయాన్ని సంయుక్త కార్యాచరణ సమితి అధ్యక్ష కార్యదర్శులు నేడిక్కడ చెప్పారు

కరువుభత్యం బకాయీలను ధనరూపేణా చెల్లించాలన్న కోర్కెను ఉద్యోగులు త్యాగం చేశారు గాని ఆర్థికమంత్రి కూడా ధరలను అదుపులో పెట్టే తన బాధ్యత నిర్వర్తించాలని వారు అన్నారు.

ఆర్థికమంత్రి శ్రీ దేశాయి ధరల స్థిరీకరణకు ఒక పథకాన్ని [illegible] సూచించారు.

పెద్ద వ్యాపారులలో డబ్బును విపరీతంగా పోగుచేసుకోవటాన్ని అడ్డటానికి ఈ విధానం బాగా ఉపకరిస్తుంది.

కార్యదర్శి శ్రీ ఆల్వారిస్ ఒకప్రకటనలో వ్యాఖ్యానిస్తూ ఇప్పుడు దేశంలో 8 రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలున్నాయి కాబట్టి కేంద్రం, రాష్ట్రాలమధ్య ఆర్థిక సంబంధాలను నిర్వచించే నిమిత్తం ఒక క్రొత్త ఆర్థిక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

రైల్వే ఉద్యోగుల సమాఖ్య కార్యవర్గ విమర్శ

అఖిలభారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య సహాయ కార్యదర్శి శ్రీ ప్రియగుప్త, సమ్మె విరమించాలన్న సంయుక్త కార్యాచరణ సమితి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఆర్థిక మంత్రి ప్రతిపాదనలు అశేష ఉద్యోగుల కోర్కెలను తృప్తిపరచేవి గాని అంగీకార యోగ్యం కావని ఆయన ఒక ప్రకటనలో అన్నారు.

కాంటన్‌లో ఇంకా సాయుధ ఘర్షణలు

హాంకాంగ్, సెప్టెంబరు 5

కాంటన్‌లో మావో వ్యతిరేకులకు, అనుకూలురకు మధ్య ఇంకా సాయుధ సంఘర్షణ కొనసాగుతున్నది. హాంగ్‌కాంగ్ నుంచి వెలువడే ఇంగ్లీషు దినపత్రిక ఈ రోజు ప్రకటించింది. కాంటన్ రైల్వేస్టేషన్ ఇంకా మావో వ్యతిరేకుల స్వాధీనంలో వుందని ఈ పత్రిక తెలిపింది

చాలాకాలం తర్వాత హాంకాంగ్ సరిహద్దులోని షుంచూన్ - కాంటన్ మధ్య రైళ్ళ రాకపోకలు ప్రారంభం అయినవి.

షాంఘై ప్రజలకు మావో ముఠా విజ్ఞప్తి

హాంకాంగ్, సెప్టెంబరు 4

సైనికులనుండి ఆయుధాలు లాక్కోవద్దని షాంఘైలోని మావో ముఠా ఈ రోజు విజ్ఞప్తి చేసింది

సైన్యంనుంచి ఆయుధాలు తీసుకోవటం అనుమతించరాని విషయమని షాంఘై విప్లవ కమిటీ ప్రకటించింది.

షాంఘై నగర విప్లవ సంస్థల్లో ముఠాతత్వం

హాంకాంగ్, సెప్టెంబరు 5

విప్లవకర ప్రజాసంస్థల్లో ముఠాతత్వం, అరాచకవాదం పెచ్చుపెరిగి పోయిందని, వాటికి స్వస్తి చెప్పాలని షాంఘైనుండి వెలువడే పత్రిక "హూయిబావో" ఈ రోజు వ్రాసింది.

ఈ పత్రిక చేసిన విజ్ఞప్తిని పీపుల్స్ డైలీ పునర్ముద్రించింది. పెకింగ్ రేడియో కూడా దానిని ప్రసారం చేసింది.

షాంఘైలోని అనేక విప్లవకర ప్రజాసంస్థలలో ముఠా తత్వం వేళ్ళూనుకుని వుంది. పార్టీ [illegible] చెప్పే వరకు ఇవి పోయింది. వ్యతిరేక అభిప్రాయం కలవారిని నిరంకుశంగా అణిచివేయటం జరుగుతోంది. ఫలితంగా పార్టీ విప్లవకర పంథాకు విఘాతం కలుగుతోంది.

ఈపరిస్థితే కొనసాగితే సాంస్కృతిక విప్లవానికి తీరని ద్రోహం జరుగుతుంది

ఎడతెగని అంతర్యుద్ధం, తీవ్రఘర్షణలు అనివార్యం అవుతాయి. అని ఈ పత్రిక హెచ్చరించింది.

విభేదాలు సృష్టించే పత్రికలపై కేసులు

కేంద్ర దేశీయాంగ శాఖ సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

మత, భాషా, వర్గ తదితర విష ప్రాతిపదికల ఆధారంగా విభేదాలు సృష్టించి, సంక్షోభం రేకెత్తించే వ్రాతలు ప్రచురించిన వార్తా పత్రికల సంపాదకుల, ప్రచురణకర్తలపై కేసులు దాఖలు చేయాల్సిందిగా కేంద్ర దేశీయాంగ మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

జర్నలిజంనుంచి ఇలాంటి హానికరమైన వైఖరులను తొలగించడానికి ఈ చర్య అవసరమని దేశీయాంగశాఖ విశ్వసిస్తోంది.

మున్సిపల్ ఎన్నికల రంగం

పెద్దాపురంలో 101 నామినేషన్లు

ముగ్గురి ఏకగ్రీవ ఎన్నిక

పెద్దాపురం సెప్టెంబరు 5

తూర్పుగోదావరిజిల్లా పెద్దాపురం మున్సిపల్ ఎన్నికలలో పోటీకి 101 మంది అభ్యర్థులు నామినేషను దాఖలు చేశారు.

పోటీలేకుండా 10వ వార్డులో శ్రీ ముప్పన రామారావు 16 వ వార్డులో శ్రీ బల్లా రామారావు, 7 వ వార్డు రిజర్వు సీటులో శ్రీ యెండమూరి ధర్మయ్య ఎన్నికైనారు.

కమ్యూనిస్టుపార్టీ 5 వార్డులలో పోటీ పెట్టింది. వీలునుబట్టి ఇతర వార్డులలో సైతం మరికొంతమంది అభ్యర్థులను నిలబెట్టడానికి యోచిస్తున్నది.

మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుపుటకు స్థానిక పెద్దలు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. పాతకౌన్సిలర్లను ఏకగ్రీవంగా గెలిపించుటకు ఈ కమిటీ చేసిన కృషి విఫలమైంది.

ఎన్నికల్లో పోటీల నివారణకు ఐక్యతకూ కమ్యూనిస్టుపార్టీ చివరవరకూ కృషిచేసింది. కాని ఐక్యతా కృషికి విఘాతం కల్పిస్తూ ఈనెల 1 వ తేదీనాటికి మొత్తం 84 గురు నామినేషన్లు దాఖలు చేశారు. గత్యంతరంలేక చివరకు కమ్యూనిస్టుపార్టీ నామినేషన్లు వేసింది.

పోటీల నివారణకు ఇంకా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఖమ్మంలో 24 సీట్లకు 104 నామినేషన్లు: 7 స్థానాల్లో కమ్యూనిస్టు పోటీ

ఖమ్మం, సెప్టెంబరు 6

ఖమ్మం పట్టణంలో 24 సీట్లకు 104 మంది నామినేషను దాఖలు చేశారు.

వీటిలో కమ్యూనిస్టు పార్టీ 7 స్థానాలకు మార్క్సిస్టుపార్టీ 21 స్థానాలకు పోటీచేస్తున్నాయి నామినేషన్లు దాఖలుచేసిన మిగతా 76 మందిలో కాంగ్రెస్, తిరుగుబాటు కాంగ్రెస్ ఇండిపెండెంటు పోటీ చేస్తున్నారు. 24వ తేదీన ఎన్నికలు జరుగుతాయి.

అమలాపురంలో 20 స్థానాలకు 81 మంది పోటీ

అమలాపురం, సెప్టెంబరు 5

అమలాపురం మునిసిపాలిటీ ఎన్నికల్లో 16 వార్డులలో 20 స్థానాలకు 81 మంది పోటీ చేస్తున్నారు. మొత్తం నామినేషన్లు దాఖలు చేసినారు. 1 వ వార్డులో కమ్యూనిస్టు అభ్యర్థి కూడ నామినేషను దాఖలు చేశారు.

నిడదవోలు పౌర సేవా సమితి అభ్యర్థుల జాబితా

నిడదవోలు, సెప్టెంబరు 3

సెప్టెంబరు నెలలో జరుగు మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయుటకు నిడదవోలు పట్టణ సేవా సమితి నిర్ణయించిన అభ్యర్థుల నికర జాబితా యీ క్రింద యిస్తున్నాం. ఇందులో కమ్యూనిస్టు పార్టీ భాగస్వామిగా వుంది.

1 వ వార్డు: శ్రీ బండి రామారావు 2 వ వార్డు: (జనరల్) శ్రీ డా॥ బి.వి.ఎల్. యన్. రాజు, (రిజర్వు) శ్రీ ఇర్లపాటి వెంకన్న. 3వ వార్డు: శ్రీ కందుకూరి సూర్యనారాయణ 4 వ వార్డు: శ్రీ దేవరకొండ భుజంగరావు (క), 5 వ వార్డు: శ్రీ టి. వి. రత్నం(క) 6 వ వార్డు: శ్రీ ఉద్దగిరి సత్యనారాయణ. 7 వ వార్డు: (జనరల్) శ్రీ అబ్దుల్ అలీమ్ రిజర్వు శ్రీమతి పిల్లాడి వీరమ్మ. 8 వ వార్డు: శ్రీ ముంగండి వెంకటరత్నం (నల బ్రాను). 9 వ వార్డు శ్రీ అబ్దుల్ మజీద్ (షాజాన్). 10 వ వార్డు: (జనరల్) శ్రీ కంతేటి సూర్యారావు. (రిజర్వు) శ్రీ పూజారి సూరారావు. 11 వ వార్డు: డా॥ బొమ్మ సత్యనారాయణ. 12 వ వార్డు. శ్రీ కొత్తపల్లి శ్రీరాములు. 13 వ వార్డు (జనరల్) శ్రీ నగేశు సుబ్బారావు, (రిజర్వు) శ్రీమతి దోనపోతుల సత్యవమ్మ. 14 వ వార్డు: శ్రీ మేడపాటి చంద్రారెడ్డి. 15వ వార్డు: (జనరల్) శ్రీ కొప్పూరి భాస్కరరెడ్డి, (రిజర్వు) శ్రీ మానేపల్లి సుబ్బన్నరావు.

మార్క్సిస్టుపార్టీ అధికార కాంగ్రెసుతో కలసి సర్దుబాట్లు చేసుకొని డాక్టర్ రాజుగారి పైన, కమ్యూనిస్టు అభ్యర్థుల పైన తన అభ్యర్థులను పోటీ పెట్టి తన సహజ ధోరణిలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం చూచి పట్టణ ప్రజలు అసహ్యించుకుంటూ వున్నారు.

ఒంగోలులో 153 నామినేషన్ల దాఖలు

ఒంగోలు, సెప్టెంబరు 4

గుంటూరు జిల్లా ఒంగోలు మునిసిపాలిటీలోని 21 వార్డులలోని 24 సీట్లకు మొత్తం 153 మంది ఎలక్షను ఆఫీసరు శ్రీ యం. ఏ. ప్రసాదరావు వద్ద నామినేషన్లు దాఖలు చేశారు పై 24 సీట్లలో 3 రిజర్వు సీట్లు ఉన్నాయి, వాటిలో 2 సీట్లలో స్త్రీలు 1 సీటులో హరిజన అభ్యర్థి పోటీ చేయవలసి వుంది.

నామినేషన్లు దాఖలుచేసిన వారిలో మాజీ చైర్మన్ శ్రీ తాతా కన్నయ్య, శ్రీ యస్. సీతారామయ్య నాయుడు. 23 మంది మాజీ కౌన్సిలర్లు వున్నారు. సెప్టెంబరు 24 న ఎన్నికలు. వోట్ల లెక్కింపు 25 న జరుగుతాయి

బర్మాకు చైనాచే మరో నిరసన

హాంకాంగ్, సెప్టెంబరు 4

బర్మాలోని చైనీయుడొకడిని హత్య చేసినందుకని, చైనా ప్రభుత్వం బర్మాకు ఈరోజు మరో నిరసనను తెలిపింది.

జూలై 3 వ తేదీన చైనీయుడొకరైన 'లిక్ హుంగ్‌చువాన్'ను అనవసరంగా బర్మా సైనికాధికారులు అరెస్టు చేశారని, తర్వాత చిత్రహింసలకు గురిచేశారనీ, చైనా ప్రభుత్వం ఆరోపించింది. రెండో రోజున చువాను హత్య చేశారని అన్నది.

రంగూన్ అధికారులు చువాన్ స్మృతి చిహ్నం నెలకొల్పాలని, ఆయన కుటుంబానికి నష్టపరిహారం యివ్వాలని, చేసిన తప్పుకు బహిరంగ విచారణ చెప్పాలని కోరింది.

అమెరికా ప్రభుత్వ వర్గాల ఉబ్బితబ్బిబ్బు

దక్షిణ వియత్నాం ఎన్నికల ఫలితాలపై

ఐ. రా. స. సెప్టెంబరు 5

సైగాన్‌లోని తన కీలుబొమ్మ ప్రభుత్వం తన అధీనప్రాంతంలో 'ఇనుపపరదా'గా నిర్వహించిన జనరల్ ఎన్నికల ఫలితాలపట్ల అమెరికన్ ప్రభుత్వవర్గాలు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నవి. సైనిక పాలక ముఠాకు ఈ ఎన్నికద్వారా చట్టబద్ధమైన ఆమోదముద్ర లభించిందనీ, యిక ఆ ముఠాను అడ్డుపెట్టుకొని తాము వియత్నాంలో ముందుముందు మరింత యుద్ధోన్మాదంగా సంచరించవచ్చునీ వారు ఉబ్బిపోతున్నారు.

ఐ. రా. స వర్గాలలో మాత్రం యీ ఎన్నిక ఫలితాలపట్ల చెప్పుకోదగ్గ ఆసక్తి ఏమీ వ్యక్తం కావడం లేదు.

పశ్చిమ దేశాలపై ఆల్జీరియాచే ఆంక్షలకొనసాగింపు

బ్రిటన్, అమెరికాలకు నూనె సరఫరా చేయబోమని వెల్లడి

అల్జీర్స్, సెప్టెంబరు 4

బ్రిటన్, అమెరికాలకు నూనె, సహజ వాయువు ఎగుమతులను నిషేధిస్తూ తాము పెట్టిన ఆంక్షలను కొనసాగిస్తామని అల్జీరియా విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు నేడు ప్రకటించారు.

దమాస్కస్ రేడియో విమర్శ

ఇది ఇలా వుండగా నూనె ఎగుమతులపై విధించిన ఆంక్షలను సడలిస్తూ, అరబ్ శిఖరాగ్రసభ చేసిన నిర్ణయాన్ని దమాస్కస్ రేడియో నేడు తీవ్రంగా నిరసించింది. దీనిని బట్టి సిరియా భూభాగంపై గల నూనె గొట్టాల ద్వారా నూనె సరఫరాకు సిరియా ప్రభుత్వం అనుమతించబోదేమోనన్న అనుమానాన్ని ఇక్కడి రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

గుత్తపెట్టుబడుల నిరోధకబిల్లు పరిశ్రమల అభివృద్ధికి అవరోధమట:

అసోసియేటెడ్ వాణిజ్య మండలి అధ్యక్షుని ప్రసంగం

కూనూర్ (మద్రాసు), సెప్టెంబరు 4

పార్లమెంటు ముందున్న గుత్త పెట్టుబడుల నిరోధక కమిషన్ బిల్లు దేశ పారిశ్రామికీకరణకు పెద్ద అవరోధమని అసోసియేటెడ్ వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షుడు సి ఏ పిట్స్ నేడిక్కడ మాట్లాడుతూ సెలవిచ్చారు

భారతదేశ పారిశ్రామికీకరణకు ఎంత గానో సాయపడిన ప్రైవేటురంగ పరిశ్రమలపై విమర్శలు చేయటం విచారకరమని అన్నారు.

సోషలిష్టు విధానం అనుసరణ కాలానికి ముందు సంపద అభివృద్ధి అవసరమని భారతదేశంలో ఇంకా సంపద అభివృద్ధి చెందాలని చెప్పారు.

జాతీయకరణ వల్ల దేశ సంపద అభివృద్ధి కాదు. ప్రైవేట్ రంగ పరిశ్రమలకు పెద్ద ఎత్తున పన్నులు కేటాయింపటం వల్ల ఉత్సాహం లేదని అన్నారు.

కంట్రోలు ఎత్తివేసే విషయంపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ధోరణికి హర్షం వెలిబుచ్చారు

వ్యవసాయం, వ్యవసాయ సరుకుల అభివృద్ధి ద్వారానే దీర్ఘకాలిక వ్యవస్థ పటిష్ట రంగాలలో ఎదుర్కొంటున్న మాంద్యాన్ని నివారించి ముందుకు సాగటం సాధ్యమని పిట్స్ అన్నారు.

తమసంస్థ 74 వ వార్షిక సమావేశంలో మాట్లాడుతూ, కొన్ని ముఖ్యమైన పథకాల విషయంలో లోటుబడ్జెట్ విధానం అనుసరణీయమని పిట్స్ చెప్పారు. నీటివనరులు, మైనర్ ఇరిగేషన్ పథకాలు. రోడ్ల నిర్మాణానికి లోటుబడ్జెట్ విధానం అనుసరించ వచ్చునని చెప్పారు.

"ధరలు ఆదాయాలు-లాభాలపై" అంకుశం పెట్టడం అన్నది అతి కష్ట సమస్య అని, ఈ విషయమై ఒక నిర్ణయానికి రావటానికి ముందు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంటుందని అన్నారు. బాగా అభివృద్ధి అయిన, క్రమశిక్షణ గల్గిన దేశాలలో, అంకుశం సక్రమంగా అమలుజరగటం కష్టమైన పని అని అన్నారు.

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరపటంలో గుజరాత్ రాష్ట్రం పెట్టుకున్న పరిమితిలో 97.5 శాతం విజయం కలిగింది. 40,000 శస్త్ర చికిత్సలు జరగాలని పరిమితి పెట్టుకోగా 39,000 శస్త్ర చికిత్సలు జరిగాయి.

జెకోస్లోవేకియా విమానానికి ప్రమాదం

31 మంది మరణం

గాండర్ (జెకోస్లావేకియా) సెప్టెంబరు 5

గాండర్ సమీపంలో 69 మంది ప్రయాణీకులతో వస్తున్న జెకోస్లోవేకియా విమానమొకటి కూలిపోయింది. కనీసం 31 మంది మరణించారు.

33 మంది గాయపడ్డారనీ, వారిలో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారనీ, 5 గురు కన్పించటంలేదని పోలీసులు చెప్పారు.

జెక్ రాజధాని నుండి క్యూబా రాజధానికి బయలుదేరిన ఈ విమానం గాండర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈశాన్యంగా 24 మైళ్ళలో కూలిపోయింది. బద్దలయిన విమాన భాగాలు ప్రయాణీకుల శరీరాలు వెయ్యి గజాల ప్రాంతంలో పడిపోయాయి.

సహాయక కార్యక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు చెప్పారు.

వ్యవసాయ రంగాన్ని ప్రయివేటు పరిశ్రమ దారులకు కట్టబెట్టాలట!

శ్రీ యల్. యన్. బిర్లా సూచిస్తున్న పరిష్కారం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

ఎటుగూ బొటుగూ లేకుండా దుస్థితిలో పడివున్న దేశీయ వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింపజేసేందుకు, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను సమన్వయ పరచేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలుతీసుకోవాలని. బడా గుత్త పారిశ్రామిక వేత్త భారతీయ వాణిజ్య, పారిశ్రామిక మండలి సమాఖ్య అధ్యక్షులు శ్రీ యల్. యన్. బిర్లా ఇక్కడ అన్నారు.

ఆహార మండలాల్ని రద్దు చేయాలనీ, వ్యవసాయంలోకి ప్రయివేటు పారిశ్రామిక కంపెనీలను ప్రవేశించనివ్వాలనీ, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను పారిశ్రామికసంస్థలకు కట్టబెట్టాలని శ్రీబిర్లా డిమాండ్ చేశారు.

దేశ పారిశ్రామిక, వ్యవసాయరంగ సమస్యల గురించి యిక్కడ రెండురోజులుగా జరుగుతున్న ఒకగోష్ఠిని ప్రారంభిస్తూ ఆయన యీ ప్రసంగం చేశారు.

ఎగుమతులలో వ్యవసాయ సరుకులు తక్కువగా వుంటున్నాయని ఆయనఅన్నారు.

గత కొలది సంవత్సరాలలో వర్షాభావ పరిస్థితులవల్ల వ్యవసాయోత్పత్తులు బాగా దెబ్బతిన్నాయని ఆయన అన్నారు, ఉక్కు-తదితర రంగాలలో కూడా ఉత్పత్తులు తగ్గిపోయాయి అని ఆయన చెప్పారు.

పరిశ్రమలు అభివృద్ధి చెందకుండా, వ్యవసాయరంగం అభివృద్ధి చెందజాలదని ఆయన అన్నారు.

ఆహార ధాన్యాల ధరలు పెరిగితే. ఆ ప్రభావం పరిశ్రమలపైకూడా పడుతుందని, పరిశ్రమలలో ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని ఆయన అన్నారు.

అందువల్ల వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని సమన్వయంచేసి అభివృద్ధి సాధించాలని ఆయన అన్నారు.

గ్రామీణ ప్రజానీకం తగిన మోతాదులో పారిశ్రామిక సరుకులను కొనుగోలు చేయలేక పోవటంవల్ల ఇంజనీరింగ్, తదితర పరిశ్రమలలో స్తంభనాకారణాలు వ్యక్తమౌతున్నాయన్నారు

గత మూడు సంవత్సరాలుగా ఆహార ధాన్యాల ధరలు పెరిగి, గ్రామీణ ప్రజానీకం లాభించినప్పటికీ, ఈ ధోరణి మొత్తం దేశానికి లాభదాయకంగా లేదని అన్నారు

వ్యవసాయానికి అవసరమైన పరికరాలను రైతులు కొనేట్లు చేయాలని ఆయన అన్నారు. ఈ కర్తవ్యాన్ని ప్రభుత్వ విధానాల ద్వారానే పూర్తిచేయటం సాధ్యం కాదని, పరిశ్రమలు కూడా ఈ కర్తవ్య నిర్వహణ బాధ్యతను నిర్వహించాలని అన్నారు.

సహకార వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ పథకం విఫలమైనట్లు చెప్పి. ఆ వైఫల్యం యాదృచ్ఛికంగా వచ్చినట్లు భావించకుండా విధానంపై పునరాలోచన జరపాలని ఆయన ఉపదేశించారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 11 న ప్రదర్శన

ఏలూరు కమ్యూనిస్టు సమితి కార్యవర్గ నిర్ణయం

ఏలూరు, సెప్టెంబరు 6

అధికధరలకు వ్యతిరేకంగా ఈనెల 11 న పెద్దయెత్తున ప్రదర్శన జరపాలని ఏలూరు తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యవర్గం నిర్ణయించింది

ఏలూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం శ్రీ పులవర్తి విజయ సారధి అధ్యక్షతన జరిగింది.

తాలూకాలోని పరిస్థితులు, జిల్లా పార్టీ నిర్ణయాలను గూర్చి తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ నేతల పోతరాజు వివరించారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 11 వ తేదీన జరిగే ప్రదర్శన కార్యక్రమాన్ని తాలూకాలో ప్రచారం చేసి, ప్రజా సమీకరణ జరిపి, జిల్లా కలెక్టరుకు మెమొరాండం సమర్పించుటకు తీర్మానించారు.

తాలూకాలో వ్యవసాయ కార్మికులు ఎక్కువగావున్న గ్రామాలలో చౌక డిపోలు తెరచి, కంట్రోలు ధరకు [illegible] బియ్యం సప్లయి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ, తీర్మానించారు.

పాలగూడెం, కొట్లంపూడి, గ్రామాల్లోని పేదలకు ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయవలసిందిగా కోరుతూ తీర్మానించారు.

లోకసభ స్పీకరు హుకుమ్‌సింగ్ నాయకత్వాన 11 మంది సభ్యులుగల ఒక ప్రతినిధివర్గం రాజా మహేంద్రను సెప్టెంబరు 5 ఉదయం కలుసుకున్నారు. అంతకుముందు ఈ ప్రతినిధివర్గం నేపాల్ యువజన సంఘమూ, నేపాల్ సాంస్కృతిక సంఘం ఇచ్చిన విందులలో పాల్గొంది.

రు. 20/- లకే
గడియారం పొందండి

మేము ప్రారంభించిన కొత్త స్కీము ప్రకారం రు. 147/. ల ఖరీదు గల ప్రసిద్ధి చెందిన రోమెర్ గడియారం రు. 20/. లకే పొందండి నేడే ఆర్డరు చేయండి.

రోమెర్ ఏజెన్సీస్, (VA-15)
బాక్సు: 1441, ఢిల్లీ-6

EDUCATIONAL

"Account Test" Andhra-Pradesh: for Executive Officers Subordinate Officers, Parts: I, II. P. W. D. Headmasters and Local Board Employees Account Tests & Dep [illegible] -ctors, Tests. Postal Tuition Offered. ProspectusFree. Apply:

Account Test Institute,
Egmore, Madras-8,

లాభదాయకం, అధునాతనమైన చిన్నతరహా కుటీర పరిశ్రమ కొద్ది పెట్టుబడితో ప్రారంభించండి

కొద్ది పెట్టుబడితో పూర్తికాలికంగా కాని, సహాయపరిశ్రమగా కాని లఘుపరిశ్రమ ప్రారంభించదలచుకున్నవారు (ఆధునాతన కుటీర పరిశ్రమలు అన్న తెలుగు గ్రంథం 2 సంపుటాలు చదవాలి. లాభదాయకమైన చిన్నతరహా పరిశ్రమలకొరకు ముడిసరుకులు దొరుకుచోట్లు. యంత్రాలను వాయిదాలపద్ధతిని తెప్పించుకోవటం. లఘుపరిశ్రమలకు ప్రభుత్వసహాయం వగైరా ఎన్నో విషయాలున్నాయి. 960 పుటలు, 350 బొమ్మలు, గుడ్డబైండ్ ప్రతి ధర రు. 15.50. తపాలా ఖర్చు రు. 2.00. ఇతర ప్రతులు: ఇంగ్లీషు మరాఠీ రు. 15.50 హిందీ రు. 16.00 గుజరాతీ, మళయాళం, తమిళం, కన్నడం రు. 13.00 లు.

COTTAGE INDUSTRY (V N - 38) P. B. 1262, Behind Recruiting Office
Near Red Fort, Jamuna Road, Delhi.6. Telephone 262885.



అనేకసార్లు పరీక్షలకు లోనైన మేలిరకం ఉక్కు గొట్టాలతో తయారుచేయబడడమేగాక తుప్పుపట్టకుండాను, పగిలి పోకుండాను వుండడానికిగాను ప్రత్యేకంగా బాండ్‌రైజ్ చేయబడినదన్న హామీకి గుర్తు అయిన 'క్రోమ్‌లైట్' మార్కుతో మడత పెట్టుకోడానికి అనువైన ఉక్కు సామాగ్రి ఫోల్డీలక్స్ అసాధారణమైన హాలో రివెటింగ్

"క్రోమ్‌లైట్" విశేష శ్రమకోర్చి జరిపిన పరిశోధనల ఫలితం ఇందులో వున్న ప్రతి ముక్కా గట్టిదని, మన్నిక ఎక్కువని, అందానికి సాటిలేనిదని విడమర్చి చెప్పవలసిన పనిలేదు.

తేలికగావుండి, అనేక నమూనాలలోను, అనేక రంగులలోను లభ్యంకాగల ఫోల్డీలక్స్ మడత ఉక్కు సామాగ్రికి క్రోమ్‌లైట్ **హామీ ఉంటుంది.**

ఉత్పత్తిదారులు:
క్రోమ్‌లైట్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్

హెడ్ ఆఫీసు: పి-35 ఇండియా ఎక్స్ఛేంజి ప్లేస్, కలకత్తా
వర్క్సు: 38/39, జి టి రోడ్, సాల్కియా, హౌరా-7

ఆంధ్రప్రదేశ్, [illegible] రాష్ట్రములకు ఏజెంట్లు:
మహమ్మద్ ఇబ్రహీం అండ్ కం, ప్రైవేట్ లి, 7/8, మౌంట్‌రోడ్, మద్రాసు-2
హైదరాబాద్ మరియు బెంగళూరులలో కూడా కలరు.
కేరళ రాష్ట్రమునకు ఏజెంట్లు: సి. పి లోనప్పన్ అండ్ సన్స్, ఎర్నాకుళం, కేరళ.

ఏడెన్ స్థావరానికి బ్రిటన్ సలాం

లండన్, సెప్టెంబరు 4

అరేబియా దక్షిణ భాగంలో వున్న ఏడెన్ స్థావరం నుంచి తన సైనిక బలగాలను సాధ్యమైనంత త్వరలో ఉపసంహరించుకొని - అక్కడి జాతీయ విముక్తి సంఘటనతో రాజీ పడాలని బ్రిటన్ నిశ్చయించింది అని నేడిక్కడ అభిజ్ఞవర్గాల ద్వారా తెలియవచ్చింది.

రేడియో

శుక్రవారం — సెప్టెంబరు 8

శక 1889 ★ భాద్రపద 17

విజయవాడ

357.1 (840 కిలో సై.)

ఉదయం 6.00 వందేమాతరం. శుభోదయం, ప్రసారవిశేషాలు; 6.10 భక్తిరంజని; 6.40 అం. వా 6.45 సూక్తిముక్తావళి; 6.50 బజారుధరలు; 6.55 విరామ సంగీతం; 7.00 తె. వా; 7.15 గాంధీ మార్గం; 7.40 డి. రామారావు - వేణువు; 8.00 అం. వా; 8.15 హిం. వా; 8.30 హైదరాబాద్ రిలే; 9.00 ప్రసార సమాప్తి.

11.45 ప్రాథమిక పాఠశాలలకు - మన నదులు, కృష్ణ - రూపకం; 12.05 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 వనితావాణి; 1.30 అం. వా; 1.40 హిం. వా; 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన; 2.01 చిత్ర తరంగిణి; 2.10 హైదరాబాద్ రిలే; 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 స్థానిక ప్రకటనలు; 5.35 హై. రిలే; 6.00 అం. వా; 6.05 ప్రాం. వా; 6.15 వాద్య బృందము, 6.25 ప్రకటింపబడును; 6.30 పంటసీమలు; 7.00 తె. వా; 7.15 వెలుగుబాట; 7.30 హై. రిలే; 9.00 అం. వా; 9.15 ఢిల్లీనుండి రిలే; 9.30 సాహిత్య నందిని - నంధికా కార్యక్రమం; 10.00 డి. రామారావు - వేణువు. 10.30 అం. వా; 10.35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6.00 వందేమాతరం-మంగళధ్వని - కార్యక్రమ వివరణ: 6.10 భక్తిరంజని; 6.40 అం. వా; 6.45 సూక్తిముక్తావళి: 6.50 వాద్య గోష్ఠి: 6.55 హితవచనం; 7.00 తె. వా; 7.15 గాంధీమార్గం; 7.40 విరామసంగీతం; 7.45 శాస్త్రీయసంగీత్; 8.00 అం. వా; 8.15 హిం. వా; 8.30 ఎస్. ఎల్. ఎన్. శాస్త్రి - వయొలిన్; 9.00 ప్రసార సమాప్తి.

11.45 ఢి. రిలే; 12.05 సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 ఢి. రిలే; 1.30 అం. వా. 1.40 చిత్రసీమ; 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన - చిత్రసీమ; 2.10 ఉన్నత పాఠశాలలకు - ఇంగ్లీషు పాఠం - 8 వ తరగతి; 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 స్థానిక ప్రకటనలు; 5.35 లలిత సంగీతం; 5.50 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం - సంభాషణ. 6.00 అం. వా; 6.05 ప్రాం. వా; 6.15 ప్రాం. వా. ఉర్దూ; (హైదరాబాద్, కడపలకుమాత్రమే) 6.25 ముఖ్య ప్రకటనలు; 6.30 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7.00 తె. వా; 7.15 వెలుగుబాట; 7.30 నేతి శ్రీరామశర్మ - గాత్రం; 9.00 అం. వా; 9.15 ఢిల్లీ నుండి రిలే; 9.30 విజయవాడ రిలే; 10.00 ఎస్. ఎల్. ఎన్. శాస్త్రి - వయొలిన్; 10.30 అం. వా; 10.35 హిం. వా; 10.40 జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై.)

సా॥ 5.30 నుండి రాత్రి 10.40 వరకు

శనివారములు మాత్రం

సా॥ 5.30 నుండి రా॥ 11.10 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)

సా॥ 5.30 నుండి రా॥ 10.40 వరకు

హైదరాబాద్ - (బి)

283 మీ. (1060 కిలో సై.)

మధ్యాహ్నం: 2.00 యల్. రాయన్న - క్లారినెట్; 2.10 ఉ. వా; 2.20 ప్రాదేశిక్ సంగీత్; 2.30 అంబాదాస్ ఆప్టే ఖయాల్. 3.00 ప్రసార సమాప్తి.

రాత్రి: 8.00 గంగూభాయి హంగల్: 8.45 జానపద గేయాలు; 9.00 ప్రసంగము- హిందీ; 9.15 ఉ. వా; 9.30 ఉర్దూలో కార్యక్రమం; 10.00 జన గణ మన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

411.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6.00 వందేమాతరం, మంగళగానం; 6.40 అం. వా; 6.45 సంగీతామృతం 7.00 తె. వా; 7.15 సంగీత మంజరి 7.30 టి. జి. పళనిస్వామి - నాదస్వరం; 8.00 అం. వా 8.15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11.55 ప్రాంతీయ శెయిదిగళ్; 1.00 ఆంగ్లం; 1.30 అం. వా; 1.40 హిం. వా 1.50 తె. వా, 2.10 వాద్య సంగీతము; 2.30 విరామ సంగీతం; 2.40 పాఠశాలలకు - గుప్తరాజుల స్వర్ణ యుగము - ప్రసంగం; 3.00 ప్రసార సమాప్తి.

(సాయంత్రం 5.30 నుండి 6.45 వరకు 60.98 మీటర్లపై కూడా)

సాయంత్రం 5.30 ఆంగ్లం; 6.00 అం. వా; 6.05 ప్రాంతీయ శెయిదిగళ్; 6.15 విరామ సంగీతం 6.20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు; నాటిక్కు నాడగం. 6.45 టి. జి. పళనిస్వామి - నాదస్వరము; 7.00 తె. వా; 7.15 గానలహరి; 7.30 గీతమాలిక; 8.00 ఆంగ్లం; 8.30 ఈ మాసపు పాట; 8.35 మెల్లిశై; 8.45 వాద్యసంగీతం. 9.00 అం. వా; 9.10 ఢిల్లీ నుండి రిలే 9.30 ఆంగ్లము; 10.30 అం. వా; 10.35 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.



చిన్న పిల్లల పుస్తకాలు

1.	తిమూరు అతనిదళం		పేజీలు 83	రూ. 1-80
2.	బొమ్మల కథలు	ఎ. రాడ్‌లాన్	48	0.90
3.	చుక్ గెక్ అన్నదమ్ములు	ఆర్కాడి గైదర్	50	1.50
4.	చిన్నారి కోడిపుంజు - బంగారి మేని గౌను	అ. ని. టాల్‌స్టాయ్	22	0.50
5.	ఇదేం పిట్ట?	వి. సుతీయేవ్	28	0.55
6.	వేర్వేరు చక్రాలు	..	16	0.35
7.	ఎవరు మ్యావ్ అన్నారు?	..	16	0.35
8.	మూడు ఎలుగులు	లియో టాల్‌స్టాయ్	24	0.50
9.	మాయగుర్రం — మేటిగుర్రం	యం బాలటోవ్	20	0.50
10.	ఏడురంగుల పువ్వు	వి. కటాయేవ్	24	0.50

పోస్టేజి అదనం - ప్రచురణలు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ-2

విశాలాంధ్రబుక్‌హౌస్, సుల్తాన్‌బజారు, హైదరాబాద్

ADMARK

LENIN'S WORK
OF CURRENT INTEREST

On culture and Cultural Revolution

Content

The Heritage we Renounce· Notes of a Publicist: The Three Sources and Three Coponent Parts of Marxism Critical Remarks on the National Question: The National Pride of Great Russions· On Proletarian Culture; on the significance of Militant Materialism: Pages from a Diary, on Co-Operation: Better Power but Better and others.

PP 297 Rs. 1-60

Postage Extra

SUBSCRIBE WITH

VISALAANDHRA PUBLISHING HOUSE,
Eluru Road Centre : : Vijayawada - 2

VISALAANDHRA BOOK HOUSE,
Sultan Bazar, Hyderabad.

ADMARK

దామరమడుగులో పోలీసు క్యాంపు ఎత్తివేయాలి

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ స్వర్ణ వేమయ్య డిమాండ్

నెల్లూరు సెప్టెంబరు 6

నెల్లూరుజిల్లా దామరమడుగు గ్రామంలో వ్యవసాయ కార్మిక సమ్మెను బలప్రయోగంతో అణచడానికై పెట్టిన పోలీసు క్యాంపును, విధించిన నిషేధాజ్ఞలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు శ్రీ స్వర్ణ వేమయ్య ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు

నెల్లూరుజిల్లా దామరమడుగు గ్రామంలో వ్యవసాయ కార్మికులు తమ న్యాయమైన కూలీరేట్ల కొరకు దాదాపు నెల రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ పోరాటంలో భూస్వాములు పోలీసు మద్దతుతో కూలీల కనీస కోర్కెలను త్రోసిపుచ్చుటకు అనుసరించిన పద్ధతులు చాలా గర్హనీయమైనవి. చివరకు ఆర్. డి. ఓ రాజీ సూచనలను కూడా నిరాకరించడం భూస్వాముల మొండి వైఖరిని చాటిచెబుతున్నది. పోటీ కూలీలను గ్రామంలో దింపి సమ్మె చేస్తున్న కార్మికులను లొంగతీసుకోవాలని చూస్తున్న భూస్వాములకు వత్తాసు నిస్తున్న పోలీసు చర్యలను తీవ్రంగాఖండిస్తున్నాను. పోటీ కూలీల వద్దకు వెళ్ళి తమ పరిస్థితులు చెప్పుకొనే అవకాశం కూడా వ్యవసాయ కార్మికులకు లేకుండా వారి నోళ్లుకట్టివేయడం, వ్యవసాయ కార్మికులపై దౌర్జన్యం జరిపి ఎంతోమందిని ప్రమాదకరమైన దెబ్బలకు గురిచేసిన భూస్వాములను ఒక్కరిని కూడా అరెస్టు చేయకుండడం పోలీసు అధికార్ల పక్షపాత వైఖరినే తెలుపుతున్నది. శాంతియుతంగా పికెటింగ్ చేస్తున్న వ్యవసాయ కార్మికులపై స్త్రీ పురుష వివక్షణ లేకుండా అకారణంగా బాష్పవాయువు ప్రయోగించడం, అమానుషంగా లాఠీచార్జి జరపడం, అక్రమ అరెస్టులు సాగించడం, ప్రజలను తిట్టడం, కొట్టడంలాంటి దుశ్చర్యలను సాగిస్తున్న పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు చర్యలు దారుణమైనవి.

జిల్లాకలెక్టర్ చేతగానితనం

జిల్లాకలెక్టరువద్దకు వ్యవసాయ కార్మిక ప్రతినిధులు రాయబారం వెళ్ళటం జరిగినాక కలెక్టరు ఆ గ్రామం వచ్చికూడ ఈ సమస్యను పరిష్కరించుటలో విఫలమయ్యారు. కావలి ఆర్. డి. వో. యీ సమస్యా పరిష్కారానికి చేసిన కృషిలో సగభాగం వీరు కృషి చేసి వున్నా నిజంగా ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టరు ఏమాత్రం ప్రయత్నించి వున్నా ఇది పరిష్కరింపబడి వుండేది. జిల్లా అధికారిఅయివుండి కూడ ఈ సమస్యను పరిష్కరించలేకపోవడం వారి అసమర్థత తప్ప మరో కారణం కాదు.

భూస్వాములు నేడు అనుసరిస్తున్న విధానాలను రోజురోజు అర్థంచేసుకొంటున్న రైతులు కూలీల కోర్కెప్రకారం 2.25 2.50 ప్రకారం (మధ్యాహ్నం భోజనానికి ఇంటికివచ్చి పోతే 2.25; మధ్యాహ్నం భోజనం పొలములో నికితెచ్చుకుంటే 2.50కి, పాటు వేయించుకొంటున్నారు. ఈ విధంగా కూలీల న్యాయమైన కోర్కెలను బలపరుస్తూ అమలు జరుపుతూ ముందుకువచ్చిన రైతులను అభినందిస్తున్నాను.

ఆ గ్రామ వ్యవసాయ కార్మికుల న్యాయమైన సమ్మె పోరాటాన్ని బలపర్చాలని, భూస్వాములు, పోలీసు అధికార్లు కలిసి కొనసాగిస్తున్న అక్రమ చర్యలను ఖండించవలసినదిగా రాష్ట్రంలోని వ్యవసాయ కార్మిక సంఘాలకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎంతో ఐక్యతతో, దృఢదీక్షతో సమ్మె పోరాటాన్ని కొనసాగిస్తున్న ఆ గ్రామ వ్యవసాయ కార్మికులను, కార్యకర్తలను అభినందిస్తున్నాను.

పోలీసుక్యాంపు ఎత్తివేయాలి

గ్రామంలో శాంతిభద్రతలను కాపాడక పోగా కేవలం భూస్వాముల ఏజంట్లుగా ప్రవర్తిస్తున్న పోలీసు క్యాంపును ఎత్తివేయాలి. 145 సెక్షన్ రద్దు చేయాలి. వ్యవసాయ కార్మికులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి, అరెస్టు అయిన వారిని వెంటనే విడుదల చేయాలి.

ప్రభుత్వ రుణాలకై చిల్లర వర్తకులపై అధికార్ల ఒత్తిడి

వినుకొండ తాలూకాలో సంఘటన

వినుకొండ, సెప్టెంబరు 2

గుంటూరుజిల్లా వినుకొండ తాలూకాలో ప్రతి గ్రామంలోను, ముఖ్యంగా వినుకొండ పట్టణంలో చిన్న వర్తకులపై కిరాణా వర్తకులపై రివెన్యూ అధికారులు, సేల్స్‌టాక్స్ డిపార్టుమెంటువారు, పంచాయితీ డిపార్టుమెంటువారు యావన్మంది దౌర్జన్యంగా అధికార దుర్వినియోగంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోనుకు ప్రతి డిపార్టుమెంటువారు వర్తకులను వేధించుచూ ఎవరికి వారు వసూలు చేస్తున్నారు. వినుకొండలో దాదాపు రు 10,000 వసూలుకు పథకమేర్పరచి కొంత వసూలుచేసినట్లు. అట్టే, తాలూకాలో దాదాపు 80,000లు వసూలు చేయుటకు పథకం వేసుకొని గ్రామ గ్రామమునకు తహసీల్దార్ వెళ్ళి బెదిరించి వసూలు చేస్తున్నట్లు, ఉపాధ్యాయులవద్ద స్కూల్స్ ఇన్‌స్పెక్టరు నిర్బంధంగా వసూలు చేయుచున్నట్లు తెలియుచున్నది. అధిక ధరలున్న ఈ రోజులలో ఎలా జీవించవలెనోయని అందరూ విచారాన్ని వ్యక్తం చేయుచున్నారు. (వి. వి.)

గుంటూరులో కిళ్లీ దుకాణాదార్ల సంఘం స్థాపన

గుంటూరు సెప్టెంబరు 3

గుంటూరు పట్టణంలోని కిళ్లీదుకాణాల యజమానులు ఆగస్టు 27 న శ్రీ నక్కా రామిరెడ్డి అధ్యక్షతను సమావేశమైసంఘాన్ని స్థాపించుకున్నారు.

కిళ్లీ దుకాణాలను ఆదివారం సెలవు యాక్టు నుండి మినహాయించాలని ఈ సమావేశం కోరింది.

బీడీలు, సిగరెట్లు సేల్సుమన్ ద్వారా హోల్‌సేల్ డీలర్లకన్నా ముందుగా కిళ్లీ దుకాణాలకు పంపిణీ చేయించవలెనని విజ్ఞప్తి చేసింది

బీడీలు, సిగరెట్లు అయిదు సీళ్ళకన్న మించి కొన్నవారికి హోల్‌సేల్ డిస్కౌంటు ఇచ్చే రేటునకు ఇప్పించవలెనని విజ్ఞప్తి చేసింది.

సామిరికాయ అగ్గిపెట్టెలు కంపెనీ రేటుకు ఏజంట్లు సేల్సుమెన్ ద్వారా ఇప్పించవలెనని కోరింది.

ఆఫీసుబేరర్లను ఏర్పరచుకొని శ్రీ నక్కా రామిరెడ్డిని అధ్యక్షులుగాను, షేక్ అబ్దుల్ రహిమాన్‌ను ఉపాధ్యక్షులుగాను, తలశిల రామారావును కార్యదర్శిగాను, శ్రీ నర్సారెడ్డిని సహాయ కార్యదర్శిగాను, దాసరి పూర్ణచంద్రరావును కోశాధికారిగాను ఎన్నుకున్నారు.

శ్రీయుతులు కట్టా సాంబశివరావు, వల్లం శేషారావురాజు, కామూరు వెంకటేశ్వరరావు కేసరి వెంకటసుబ్బారెడ్డి, గోగిరెడ్డి ప్రకాశరెడ్డి పెండ్యాల రాఘవరావు, చెన్నంశెట్టి వెంకటేశ్వరరావు, కె. ఆసు, పుట్టా లింగయ్య, సింహాద్రి వెంకటనరసయ్య, కార్యవర్గసభ్యులుగా ఎన్నికైనారు (వి. వి)

బర్మా కాందిశీకులకు తక్షణం భూములు మంజూరుచేయాలి

తణుకు తాలూకా బర్మా కాందిశీకుల సంఘం డిమాండ్

తణుకు. సెప్టెంబరు 3

బర్మా నుండి కాందిశీకులుగావచ్చి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, నర్సాపురం తాలూకాలలో ఉన్నవారికి వెంటనే భూములు మంజూరు చేయాలని డిమాండుచేస్తూ తణుకు తాలూకా బర్మా కాందిశీకుల సంఘం ఈ క్రింది ప్రకటన చేస్తున్నది

బర్మానుండి వచ్చిన శరణార్థులు తణుకు, నర్సాపురం తాలూకాలలో సుమారు 800 ల కుటుంబముల వరకు కృషి లేక నిరుద్యోగంతో చాలా బాధపడుచున్నారు. ఇటీవల భారత ప్రభుత్వం ఎల్. ఆర్. నెం. (37) 67 ఆర్. హెచ్ IV క్రింద 20.4.67 తేదీన జారీచేసిన ఉత్తర్వు ప్రకారం కాందిశీకులకు ప్రతి కుటుంబమునకు 5 ఎకరములనుండి భూమిన్ని, రు 850/. లు అప్పున్నూ యిచ్చు తలంపులోనున్నట్లుగా ప్రచురణచేసియున్నారు. అందునిమిత్తం తణుకు నర్సాపురం తాలూకాలలోనున్న శరణార్థులు సుమారు 800 ల కుటుంబముల వారు దండకారణ్యంలో సాగుచేసుకొని జీవించుటకు సమ్మతించి. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు వారికి భూమి మంజూరు నిమిత్తం దరఖాస్తులు పంపుకొనియున్నారు కావున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు, వెంటనే తగు చర్యలు తీసుకొని. బర్మా శరణార్థులకు భూములు గ్రాంటుచేయించ గలందులకున్నూ, నర్సాపురం, తణుకు, అత్తిలి, పెనుగొండ నియోజక వర్గాల శాసనసభ్యులు కూడా తగు కృషిచేయగలందులకున్నూ కోరుచున్నాము."

రాజమండ్రిలో రాజ్యలక్ష్మి కళాశాల స్థాపనకు కృషి

రాజమండ్రి. సెప్టెంబరు 2

రాజమండ్రిలో శ్రీ రాజ్యలక్ష్మి కళాశాల స్థాపన సందర్భంలో కళాశాల స్థానిక హితకారిణీ సమాజం వారు ఇచ్చిన రు. 20,000 లతో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకిలో అకౌంటు ప్రారంభించారు. ఈ తేదీకి ఆ మొత్తం 40,000 దాకా పెరిగినదని తెలుస్తోంది.

శ్రీ నిడసర్తి నరసింహం అధ్యక్షతను వీరేశలింగం గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో బ్యాంకి అకౌంటు నుండి అవసరమైన సొమ్ము తీయుటకు, వేయుటకు శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి, శ్రీ వాన్న వెంకటాచార్లకు అధికారం ఇస్తూనూ, ఆంధ్ర విశ్వవిద్యాలయ అధికార్లకు అవసరమైన దరఖాస్తులు పెట్టుటకు తదితర వ్యవహారాలను నిర్వర్తించుటకు అధ్యక్షునికి అధికారం ఇస్తునూ తీర్మానించారు. (ఎ. వి.)

దేశంలో విద్యుత్తు సహకార సంస్థలు

అమెరికా నుంచి మరొక ప్రతినిధివర్గం రాక

ఆనంద్, సెప్టెంబరు 4

దేశంలో విద్యుత్తు సహకార సంస్థల గురించి పరిశీలించటానికి అమెరికా నుంచి రెండో ప్రతినిధివర్గం త్వరలో రానున్నది.

ఈ ప్రతినిధివర్గం గుజరాత్, మైసూరు, మహారాష్ట్ర, ఆంధ్రలలో, పర్యటించి, సహకార సంస్థల ఏర్పాటుకుగల అవకాశాలను పరిశీలించుతుంది.

అయిదు రాష్ట్రాలలో విద్యుత్ సహకార సంస్థల ఏర్పాటుకు అవకాశాలున్నాయని ఇదివరకు దేశంలో పర్యటించిన అమెరికా ప్రతినిధివర్గం సిఫారసు చేసింది.

మహాజన్ కమిషన్ సిఫార్సులు అంగీకరిస్తానని మైసూరు ముఖ్యమంత్రి పునరుద్ఘాటన

బెంగుళూరు సెప్టెంబరు 4

మహారాష్ట్ర కేరళలతో మైసూర్‌కుగల సరిహద్దు వివాదాల విషయంలో మహాజన్ కమిషన్ సిఫార్సులను తాను అంగీకరిస్తానని మైసూర్ ముఖ్యమంత్రి శ్రీ నిజలింగప్ప నేడు పునరుద్ఘాటించారు.

ఢిల్లీనుండి తిరిగివచ్చిన పిదప పత్రికల వారితో మాట్లాడుతూ యీ వివాదం చాలా కాలంనుంచి సాగుతోందనీ. దీన్నింతటితో ఆపివేయాలని ఆయన అన్నారు

ఈ విషయంలో భారత ప్రభుత్వం అంతిమ నిర్ణయం తీసుకొనే లోగా రాష్ట్రం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు వీలుగా, కమిషన్ రిపోర్టు ప్రతిఒకటి తమకు పంపాల్సిందిగా ఆయన కేంద్రాన్ని కోరారు. ఆ ప్రతి వారం రోజులలో రావచ్చునని ఆయన తెలిపారు.

సభలు-సమావేశాలు

డా॥ జి. రాజారావు వర్ధంతి

ఆంధ్రనాటకరంగ పితామహుడు డా॥ గరికపాటి రాజారావు చతుర్థ వర్ధంతి సందర్భముగా రాజమండ్రి కృష్ణారావుపేట యువజన సంఘం ఆధ్వర్యాన ది 8-9-1967 తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు శ్రీవీరేశలింగం విజ్ఞానగ్రంథాలయంహాలులో "సంస్మరణ సభ" జరుగుతుంది.

జోథ్‌పూర్ విశ్వవిద్యాలయం వ్యవహారాలు

దర్యాప్తుకై రాజస్థాన్ కమ్యూనిస్టుపార్టీ ఆందోళన

జోధ్‌పూర్ సెప్టెంబరు 3

జోధ్‌పూర్ విశ్వవిద్యాలయ చట్టం సెక్షను 10 (2) క్రింద జోధ్‌పూర్ విశ్వవిద్యాలయ వ్యవహారాల దర్యాప్తు జరిపించాలని కోరుతూ రాజస్థాన్ గవర్నరు శ్రీ హుకుమ్‌సింగ్‌కు రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ ఒక నివేదికను సమర్పించింది.

సిండికేట్ ముఖ్య సభ్యులు కొందరు తీవ్రమైన అభ్యంతరాలు చేస్తున్నప్పటికీ కొన్ని ఉద్యోగాలకు నియామకాలుజరిగాయనీ ఈ నియామకాలు యూనివర్శిటీ చట్టానికి, ఆమోదించిన ఆర్డినెన్సులకు విరుద్ధంగా వున్నాయనీ పై నివేదికలో కమ్యూనిస్టుపార్టీ తెలిపింది.

ఉపాధ్యాయుల కొరతవున్న ఒక పెద్ద శాఖలో ఉపాధ్యాయులను నియమించాలన్న సూచన నిరాకరింపబడిందనీ, ఒక చిన్న విభాగంలో అవసరానికన్నా ఎక్కువమంది ఉపాధ్యాయులను నియమించారనీ ఈ సంఘటనలు వైస్. ఛాన్సలర్‌ను సమర్థించే వారికి కూడా తలనొప్పి కలిగించాయనీ ఈ నివేదికలో వుంది. కొన్ని తీవ్రమైన అవకతవకలనుకూడా ఈనివేదిక ఎత్తిచూపింది

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ విషయంలో కూడా అవకతవకలున్నాయనీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘానికి 1964 నుంచి ఎన్నికలు జరపటంలేదనీ, పై నివేదిక తెలియజేసింది.

ఈ విషయాన్ని గురించి వివరించేందుకు పట్టణంలో వివిధ అభిప్రాయాలను వ్యక్తం చేసే వ్యక్తులతో కూడిన ఒక ప్రతినిధివర్గం గవర్నరును కలుసుకుంటుందని జోధ్‌పూర్ యూనిట్ కమ్యూనిస్టుపార్టీ సెక్రటరీ ఎ. జె. మెహ్రా తెలియజేశారు.

19వ అఖిలభారత వార్తా పత్రిక సంపాదకుల మహాసభ ప్రతినిధివర్గం ఒకటి సెప్టెంబరు 4న నాగార్జునసాగర్‌ను సందర్శించింది. ప్రాజెక్టు అధికారులతో సెప్టెంబరు 5 ఉదయం జరిగిన సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణంయొక్క ఆవశ్యకతను గురించి వారికి వివరించబడింది.

ఆందోళనకరంగా ఉన్న విజయవాడ ఆహార పరిస్థితి

అమలుజరగని అధికార్ల వాగ్దానాలపై అధికధరల నిరోధక అఖిలపక్ష సమితి ఖండన

విజయవాడ, సెప్టెంబరు 4

విజయవాడలో బియ్యం సరఫరా పరిస్థితిపై ఆహార ధరల నిరోధక అఖిలపక్ష సమితి తీవ్రాందోళనను వ్యక్తం చేస్తూ తీర్మానించింది.

అధిక ధరల నిరోధక అఖిలపక్ష సమితి సమావేశం ఈనెల 2 న శ్రీ గుంటు వెంకయ్య అధ్యక్షతన జరిగింది.

మిల్లులవద్ద ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించి, మంచి బియ్యం సరఫరా చేయునట్లు చూస్తామని గత నెలలో విజయవాడ సబ్ కలెక్టరు యిచ్చిన హామీ అమలు జరగలేదని. పర్యవసానంగా పనికిరాని బియ్యాన్ని మిల్లర్లు దయాదాక్షిణ్యాలులేని సరఫరా చేస్తున్నదని ప్రజలలో తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని. అందుచేత అధికారులు సత్వరంగా సవ్యమైన చర్యలు తీసుకొని మంచి రకం బియ్యం వెంటనే సరఫరా చేయించాలని ఈ సమావేశం తీర్మానించింది.

హోటళ్ళలోని రేట్లు ఎన్న, పరిశీలనకు హోటల్ యజమానుల సంఘ ప్రతినిధులతో సంయుక్త సమాలోచనలు చేయగలనని వాగ్దానంచేసిన సబ్ కలెక్టరు ఆ విషయంపై ఎటి చర్య తీసికోనందుకు సమితి తన విచారాన్ని వ్యక్తంచేయా వెంటనే అట్టి సమావేశాన్ని ఏర్పాటుచేసి హోటల్ ఫలహార రేట్లను తగ్గించుటకు కృషి చేయవలసిందిగా కోరుతూ తీర్మానించింది

పంచదార కార్డుల సరఫరా చాలా అసంతృప్తికరంగావుంది. సక్రమ పంపిణీ లేనందున ప్రజలు బాధలకు గురవుతున్నారు. అందుచేత యీ విషయంపై తగు చర్యలు తీసికొని కార్డులు జారీచేయుటాన్ని త్వరిత పరచాలని, కోటాలను వ్యక్తంగా విడుదల చేయాలని సబ్ కలెక్టరును కోరుతూ తీర్మానించింది.

ప్రజలను ఆందోళనపరుస్తున్న సమస్యలపై చర్చించుటకుగాను సబ్ కలెక్టరును త్వరలో కలుసుకోవాలనిగూడా సమితి నిర్ణయించింది.

సూపర్ మార్కెట్ ఏర్పాటుపై ప్రకటన

విజయవాడ అఖిలపక్ష నిరోధక సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

విజయవాడ పట్టణంలో ప్రభుత్వం వారు సూపర్ మార్కెట్‌ను త్వరలో ప్రారంభింపనున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంలో ప్రభుత్వ దృష్టికి ముఖ్యమైన విషయం తీసికొని రావటం అత్యవసరమని అధిక ధరల నిరోధక అఖిలపక్షసమితి తీర్మానించింది.

విజయవాడలో ఏ ఒక్క కేంద్రంలోగాక అన్ని ప్రాంతాలలో యీ మార్కెట్‌యుగాని. దాని శాఖలు గాని నెలకొల్పి ఆయా ప్రాంతీయ ప్రజలకు అందుబాటులో వుండే లాగున ఏర్పర్చాలి.

ఈ మార్కెట్టులో ప్రజల నిత్యజీవితావసర వస్తువులయిన బియ్యం, గోధుమలు, పప్పులు, ఎండుమిర, చిన్న శనగపప్పు నూనెలు, చింతపండు, బెల్లం, కూరగాయలు పాలు, చోళ్లు, శిశు ఆహారం వస్త్రాలను మాత్రమే అమ్మించాలి. పెట్టుబడి అంతా యీ వస్తువులపైనే వుండాలి.

పై వస్తువులన్నిటికి వ్యాపారుల నుండిగాక, ఉత్పత్తిదారుల నుండే నేరుగా కొనటంద్వారా దళారీల లాభాలు, అప్పులు వగైరాలతగ్గి వస్తువులను చౌకగా అమ్ముటకు వీలుకలుగుతుంది.

ఇతర విలాస వస్తువులు. ఫ్యాన్సీ వస్తువులు, బట్టలు యితర ఖరీదుగల వస్తువులను యీ మార్కెట్టులో అమ్మరాదు, పెట్టుబడి డబ్బులు హెచ్చుభాగాన్ని వీటికొరకు వినియోగించటం, హెచ్చు స్థలాన్ని ఆక్రమించటం హెచ్చు సిబ్బంది కావలసి రావటం జరుగుతుంది ఈ వస్తువులన్నీ బజారులో ప్రయివేటు వ్యాపారంద్వారా పుష్కలంగా లభించుచున్నవి. గనుక యిక్కడ పునరావసరం లేదు.

ఈవిధంగా ఏర్పాటు చేసినప్పుడే దీని ప్రభావం యితర వర్తకులపైబడి వారు సరసమైనధరలకు అమ్మవలసి వస్తుంది. అందుచేత ప్రభుత్వం పైఅంశాలను గురించి తీవ్రంగా ఆలోచించి ప్రయోజనకరమైన ఏర్పాట్లను గావించాలని సమితి కోరుచున్నాము.

చంద్రశేఖర్‌కు ఢిల్లీలో సన్మానం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3

ప్రముఖ మోనో యాక్టర్ ఆంధ్ర కళాకారుడు డాక్టర్ వి. చంద్రశేఖర్‌ను ఢిల్లీ ఆంధ్ర సంఘం ఈ రోజు సన్మానం గావించింది. భారత సాంస్కృతిక ప్రతినిధివర్గ సభ్యులుగా ఈయన సోవియట్ యూనియన్‌లో పర్యటించి తిరిగి వచ్చిన సందర్భంలో ఈ సన్మానం జరిగింది.

రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు, ఆంధ్ర సంఘం అధ్యక్షుడు అయిన డాక్టరు యస్. భగవంతం సభకు అధ్యక్షత వహించారు

ధ్వని అనుకరణ అభినయంలో శ్రీ చంద్రశేఖర్ ప్రావీణ్యాన్ని శ్రీ భగవంతం ప్రశంసించారు. తన అభినయంద్వారా శ్రీ చంద్రశేఖర్ అన్ని తరగతుల ప్రజల్ని కడుపుబ్బ నవ్వింపగలరని చెప్పారు.

ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయుల మహాసభ సమాప్తం

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 4

కళాశాల ఉపాధ్యాయుల వార్షిక సమావేశం నిన్న ఇక్కడ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

మైనర్ ఇరిగేషన్ మంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి వీడ్కోలు ప్రసంగంతో యీ మహాసభ ముగిసింది.

శ్రీ శీలం సిద్ధారెడ్డి ప్రసంగిస్తూ కాలేజి విద్యా కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన వేతనాలు యివ్వటం లేదన్న విషయాన్ని ప్రభుత్వంతీవ్రంగా ఆలోచిస్తున్నదని చెప్పారు.

విద్యా సంస్థలపై పన్ను జరుపుతున్నందుకు ఆయన అభినందనలు తెలియజేశారు.

మహాసభకు శాసన మండలి సభ్యులు శ్రీ శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు.

ఆహ్వానసంఘ అధ్యక్షుడు, శ్రీ యస్. రంగారావు ప్రతినిధులకు స్వాగతంచెప్పారు ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీ యస్. శ్రీధర్‌స్వామి మహాసభను గురించి, యేర్పాటు చేయబడిన సమస్యను గురించి వివరించారు.

విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యానికి విద్యాప్రమాణం పడిపోవటానికి కారణం ఉపాధ్యాయులేనని అంటున్న దోరణులను విమర్శిస్తూ, అందుకు, రాజకీయ నాయకులను, సమాజాన్ని నిందించాలని అన్నారు.

శ్రీ జి.వి. రత్నయ్య వందన సమర్పణతో సభ ముగిసింది.

కొఠారి కమిషన్ సిఫార్సుల అమలు

శ్రీ త్రిగుణసేన్ వాగ్దానం

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, సెప్టెంబరు 4

అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి హాజరై కేంద్ర విద్యామంత్రి శ్రీ త్రిగుణసేన్‌ను ఢిల్లీలో కలుసుకొని అఖిలభారత ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ కె. జనార్దనరావు నేడు తిరిగి హైదరాబాద్ వచ్చారు.

ఉపాధ్యాయుల వేతనాల పెంపుకు,మంచి విద్యాస్థాయి సాధించడానికి వారికి శక్తివంతమైన శిక్షణ యివ్వడానికి తాను సుముఖుడనని శ్రీ త్రిగుణసేన్, శ్రీ జనార్దనరావు ప్రభృతుల ప్రతినిధివర్గానికి చెప్పారు.

చింతలపూడి తాలూకాలో హరిజనులకుయిళ్లస్థలాలు మంజూరులోఅనవసరజాప్యం

చింతలపూడి, సెప్టెంబరు 2

పశ్చిమ గోదావరిజిల్లా చింతలపూడి తాలూకా కొంతంపాలెం హరిజనులకు వెంటనే యిళ్ళ స్థలాలు మంజూరు చేయవలసిందిగా కోరుతూ తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యుడు శ్రీ మాదాల శేషగిరిరావు విజ్ఞప్తి చేశారు.

కొంతంపాలెం హరిజనులు సుమారు 80 కుటుంబాలవారు గత 5 సంవత్సరాలుగా యిళ్ళ స్థలాలకు సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు ద్వారా ప్రయత్నం చేస్తున్నారు.

ప్రభుత్వం భూములను స్వాధీనపరచుకొని సర్వే జరిపి సుమారు సంవత్సరందాటిపోయినా. యింతవరకు హరిజనులకు స్థలాలు యివ్వకపోవడం అన్యాయం, జిల్లా కలెక్టరుకు, జిల్లా పరిషత్తు చైర్మన్‌కు హరిజనులు యీ సందర్భంగా మహజర్లు సమర్పించారు.

ప్రముఖ మరాఠీ పాత్రికేయుని మృతి

కొల్హాపూర్, సెప్టెంబరు 5

ప్రముఖ మరాఠీ పాత్రికేయుడు శ్రీ అనంత్ హరిగాడ్గే నిన్న ఆయన స్వగృహంలో మరణించారు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు. నటానంద్ గాడ్గే అని ఆయన్ను అంతా పిలిచేవారు.

ప్రస్తుతం వెలువడటం ఆగిపోయిన మరాఠీ దినపత్రిక సందేశ్‌లో పనిచేసిన తరువాత, మౌజ్, వహామౌజ్ విక్రెక్ అనే మూడు వారపత్రికలను ఆయన ప్రారంభించారు. ఇందులో రెండు పత్రికలు యిప్పుడురావటం లేదు. "జాంక ధకర్" అనబడే సహపంక్తి భోజనాలద్వారా మహారాష్ట్రలో అంటరానితనాన్ని నిర్మూలించటానికి ఆయన కృషి చేశారు. ఈ విందులలో అన్ని కులాలవారు పాల్గొనేవారు.

వ్యవసాయ వస్తువుల ధరలు

విజయవాడ, సెప్టెంబర్ 6

విజయవాడ రీజినల్ అసిస్టెంటు మార్కెటింగ్ డైరెక్టరు నేడు అందజేసిన ఉత్పత్తి దారులనుంచి కొనుగోలు చేసిన 5-9-67 నాటి టోకుధరలు (ఒక క్వింటాల్ 100 కిలో గ్రాములు లేక 220½ పౌనులు.)

కొత్తవి

ధాన్యం		75 కి.	100 కి.
నంబర్లు	విజయవాడ య.	37.13	49.50
కిచిడి	కాకినాడ	37.13	49.50
జి. ఇ. బి. 24	చిత్తూరు	37.13	49.50
అక్కుళ్ళు	విజయవాడ	31.13	41.50
..	తాడేపల్లిగూడెం	31.13	41.50
..	కాకినాడ	31.13	41.50
..	ఆముదాల వలస	31.13	41.50
సన్న కృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	34.13	45.50
..	కాకినాడ	34.13	45.50
సన్నాలు	ఆముదాలవలస	31.13	45.50
మొలకొలుకులు	నెల్లూరు	37.13	49.50

మిల్లు బియ్యం		100 కి.
జి. ఇ. బి. - 24		78.02
నంబర్లు	విజయవాడ	78.02
..	కాకినాడ	78.02
అక్కుళ్ళు	విజయవాడ కొత్తవి	66.50
..	తాడేపల్లి గూడెం	66.50
..	కాకినాడ	66.50
..	ఆముదాల వలస	66.50
సన్న కృష్ణకాటుకలు:		
.	తాడేపల్లిగూడెం	71.93
నంబర్లు	చిత్తూరు	78.00
సన్నాలు	ఆముదాలవలస	78.02
మొలకొలుకులు	నెల్లూరు	78.02

వేరుశనగ

కాయలు	విజయవాడ	103.69
..	నంద్యాల	112.0
..	ఆదోని	
..	విజయనగరం	105.00
పప్పు	విజయవాడ	162.50
..	నంద్యాల	142.00
..	ఆదోని	145.00
..	విజయనగరం	152.00
నూనె	విజయవాడ	310.30
..	నంద్యాల	300.00
..	ఆదోని	275.00
..	విజయనగరం	330.00

అపరాలు

కందులు	విజయవాడ	125.00
..	గుంటూరు	123.00
..	ఆముదాలవలస	178.00
మినుములు	విజయవాడ	180.00
..	గుంటూరు	180.00
..	ఆముదాలవలస	170.00
..	విశాఖపట్నం	145.00
పెసలు	విజయవాడ	111.00
..	గుంటూరు	115.00
..	ఆముదాలవలస	130.00
శనగలు	విజయవాడ	172.00
..	గుంటూరు	150.00
..	ఆముదాలవలస	130.00

ప్రత్తి

		పాతం	అక్కో
పామ్మడు	(ప్రత్తి)	216.00	185.00
ఆదోని	(ప్రత్తి)	152.00	183.00
..	(దూది)	365.00	411.00

చింతపండు

చిత్తూరు	1 వ రకం	300.00
	2 వ రకం	

జొన్నలు

అనంతపురం	తెల్లవి	58.50
నంద్యాల	పచ్చవి	61.50

బెల్లం

హిందూపురంలో	1 వ రకం	205.00
..	2 వ రకం	195.00
..	3 వ రకం	185.00
చిత్తూరులో	1 వ రకం	185.00
..	2 వ రకం	175.00
..	3 వ రకం	175.00
అనకాపల్లిలో	1 వ రకం	217.00
..	2 వ రకం	185.50
..	3 వ రకం	175.50
తాడేపల్లిగూడెం	1 వ రకం	204.00
	2 వ రకం	170.00

జీడిపప్పు

పేటపాలెం	అమెరికన్ రకం	913.18
..	ఇండియన్	781.81
..	బద్దలు	727.27
..	ముక్కలు	345.45

మిర్చి

జి. 2. ఒకటవ రకం	గుంటూరు	225.00
జి. రెండవ రకం	..	200.00
జి. 2వ రకం 2. వర్ష		300.00
హిందూపురం	1 వ రకం	325.0
	2 వ రకం	330.00

నెయ్యి

	వల్లాను	దేశవాళీ
గుంటూరు		900.00
ఒంగోలు	880.00	

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి	పాతవి
విజయవాడ	310.00	430.00
రాజమండ్రి	400.00	375.00
పాలకొల్లు	370.00	330.00

పసుపు

దుగ్గిరాలలో	కొమ్ములు	193.50
..	కాన్పాడు	223.00
..	దుంపలు	205.50
కడపలో	కొమ్ములు	213.00
..	దుంపలు	223.00

జనపనార

విజయనగరం	మొదటి రకం	92.43
	రెండవ రకం	87.08
	మూడవ రకం	80.33
ఆముదాలవలసలో		
	మొదటి రకం	98.33
	రెండవ రకం	87.33
	మూడవ రకం	80.00

పంచదార పర్మిట్లలో కుంభకోణం

విజయవాడ సబ్ కలెక్టరు అనుసరిస్తున్న అవకతవక పద్ధతులు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, సెప్టెంబర్ 6

వి. సి. సి. స్టోర్సులో ఉన్న బియ్యం, పంచదార నిల్వలకు మించి అధికంగా విజయవాడ సబ్‌కలెక్టరు నేడు అవకతవక పద్ధతులలో ప్రత్యేక పర్మిట్లు వేలాది ప్రజలకు జారీ చేస్తున్నారు. ప్రజల కళ్ళనీళ్ళు తుడవడానికి మాత్రమే అధికారులు ఈ వైఖరిని అవలంబించారు.

వినాయక చవితి సందర్భంగా రెండువేల మందికి ప్రత్యేక పర్మిట్లు ఇస్తానని సబ్ కలెక్టరు ప్రకటించారు. ఒక క్రమమైన పద్ధతి లేకుండా ప్రజలందరినీ సబ్ కలెక్టరు కార్యాలయంకు వచ్చి తీసుకోవాలని ప్రకటించారు.

అయితే ఈరోజున సబ్‌కలెక్టరు కార్యాలయంవద్దకు వెళ్ళి పరిశీలిస్తే సుమందికి

(మిగతా 2 వ పేజీలో)

బందరులో ఆహార సమస్యపై నిరశన

9,10,11 తేదిలలో; పౌరసమితి నిర్ణయం

బందరు, సెప్టెంబరు 5

ఆహార సమస్యపై 9,10,11 తేదీలలో బందరు పట్టణంలో నిరశన వ్రతం జరపాలని నేడిక్కడ సమావేశమయిన పౌరసమితి నిశ్చయించింది.

11 వ తేదీన జిల్లా కలెక్టరు వద్దకు పెద్ద ప్రజా ప్రదర్శనను జరపాలనికూడా నిశ్చయించింది.

పౌర సరఫరాల అధికారులు లోగడ ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నందుకు అసమ్మతిగా ఈ ఆందోళన జరగనున్నది.

11 వ తేదీన జరిగే ప్రజా ప్రదర్శనలో చుట్టుపట్ల గ్రామాల వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొనాలని ఆయా సంఘాలకు ఈ సమావేశం విజ్ఞప్తి చేసింది.

పౌర సమితి సమావేశానికి సదాశివరావు అధ్యక్షత వహించారు. (వి. వి.)

ఉన్నత విద్యా బోధనా భాషపై గోష్ఠి

కాలేజీ అధ్యాపకులలో భిన్నాభిప్రాయాలు

హైదరాబాద్, సెప్టెంబరు 5

'ఉన్నత విద్యాబోధనా భాష,' సమస్యపై ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల మహాసభ సందర్భంలో జరిగిన గోష్ఠిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనవి. మాతృ భాషలో ఉన్నత విద్యను బోధించడంలో అనేక చిక్కులుకలవని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ గోష్ఠిని శ్రీ ఎల్. వి. చలపతిరావు ప్రారంభించారు.

6 వేలమంది స్టేట్ బ్యాంకు సిబ్బంది సమ్మె

మద్రాసు, సెప్టెంబరు 5

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులు 6 వేల మందికి పైగా అక్టోబరు 3 వ తేదీన దేశ వ్యాపితంగా ఒక రోజు నిరసన సమ్మె జరప నున్నారు.

వేతనాల పునర్వ్యవస్థీకరణతోసహా జీవన వ్యయసూచీతో డి. ఎ. ను జోడించాలనీ, పెన్షన్ నిధికి నిర్బంధంగా విరాళాన్ని వసూలు చేయడాన్ని రద్దు చేయాలని, పని గంటలకు, అదనపుకాలంపనికి పరిహారాన్ని స్థిరీకరించాలని వారుడిమాండ్ చేస్తున్నారు ఈ డిమాండ్‌లను యాజమాన్యం దృష్టికి తెచ్చే నిమిత్తం ఈ నిరసనసమ్మెనుజరుపుతున్నారు.

మద్రాసు సర్కిల్‌లోని స్టేట్ బ్యాంకు ఉద్యోగులు 500 మందికి పైగా తమ డిమాండ్లకు తోడ్పాటుగా నేడు మూకుమ్మడి సెలవు పెట్టారని స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా సూపర్‌వైజరీ సిబ్బంది సమాఖ్య అధ్యక్షులు శ్రీ యస్. యన్. సుబ్రహ్మణ్యం చెప్పారు. 60 శాతానికి పైగా సూపర్వైజరు అధికారులు గుమాస్తాలకన్నా తక్కువ వేతనాన్ని పొందుతున్నారని చెప్పారు.

అత్యావసర సరుకుల చట్టం సవరణ

కేంద్రమంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

దొంగ నిల్వదారులు, బ్లాక్ మార్కెట్ వర్తకులపై [illegible] అత్యవసర వస్తువులనిబంధనా చట్టాన్ని ఇంకా పటిష్టం చేసే కొన్ని మార్పులను నేడు కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది.

దీని ప్రకారం దొంగ నిల్వలు, చీకటి వ్యాపారంచేసే వారికి మూడు సంవత్సరాల [illegible] సంవత్సరాలకు పెంచబడింది.

భారత్‌కు పశ్చిమ జర్మనీ సహాయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

భారత్‌కు 1967-68 సంవత్సరపు సహాయంగా పశ్చిమ జర్మనీ 47 కోట్లరూపాయల విలువైనవిదేశీ మారకాన్ని ఇస్తోంది.

ఈ విషయం గురించిన ఒప్పందంపై భారత ఉపప్రధాని శ్రీమురార్జీ అక్టోబరు 3,4 తేదీలలో పశ్చిమజర్మనీ పర్యటనసందర్భంలో సంతకాలు చేస్తారని తెలుస్తోంది.

బాన్‌లో శ్రీ మురార్జీ ఆర్థిక సహాయాన్ని గురించి మాత్రమేగాక రాజకీయ విషయాలను గురించికూడా ఎక్కువగా చర్చిస్తారని జర్మన్ రాయబార వర్గాలద్వారా తెలుస్తోంది.

విల్సన్ విదేశాంగ విధానానికి బ్రిటిష్ కార్మికుల అభిశంసన

వియత్నాంలో అమెరికా చర్యలను బలపర్చటానికి స్వస్తి చెప్పాలని ట్రేడ్‌యూనియన్ మహాసభ డిమాండ్

బ్రిగ్టన్, సెప్టెంబరు 5

వియత్నాంలో అమెరికా కిరాతక చర్యలను బలపర్చే విధానాన్ని విల్సన్ ప్రభుత్వం వదులుకోవాలనీ, 87½ లక్షల కార్మికులకు ప్రాతినిధ్యం వహించే బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ మహాసభ ఈరోజు తీర్మానించింది యూనియన్ నాయకత్వాన్ని ధిక్కరించి మహాసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది

13 లక్షల 67 వేల కోట్ల మెజారిటీతో ఈ తీర్మానం మహాసభ ఆమోదంపొందింది. తీర్మానానికి అనుకూలంగా 46 లక్షల 86 వేల కోట్లు రాగా ప్రతికూలంగా 33 లక్షల 19 వేల కోట్లు వచ్చాయి.

మహాసభ ఆమోదించిన తీర్మానం విల్సన్ ప్రభుత్వం అనుసరించుతున్న విదేశాంగ విధానానికి విరుద్ధంగా వుందని రాయిటర్ విలేకరి వ్రాశారు.

మిలటరీ డ్రాఫ్ట్స్‌మన్స్. యూనియన్ ప్రతినిధులు ప్రతిపాదించిన ఈ తీర్మానాన్ని ఉపసంహరింప చేయటానికి యూనియన్ జనరల్ కౌన్సిల్‌లో నాయకత్వం నానా తంటాలు పడింది.

బహుశా వచ్చే నెలలో జరిగే లేబర్ పార్టీ మహాసభలో కూడా ఇటువంటి డిమాండే రావచ్చునని లండన్ రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు

అమెరికా ప్రతినిధి వ్యాఖ్య

వియత్నాంలో జరుగుతున్న పోరాటం గురించి, గందరగోళంఎంతతీవ్రంగావుందో యిది రుజువుచేస్తున్నదని ఓటింగ్ అనంతరం ఈమహాసభకు సౌహార్ద్ర ప్రతినిధిగాహాజరయిన అమెరికా ట్రేడ్ యూనియన్ ప్రతినిధి రీవుర్ఫ్ వ్యాఖ్యానించారు.

ఆర్థికరంగంలో వైఫల్యాలకు అసమ్మతి

లేబర్ పార్టీలోని మెజారిటీ సభ్యులు ధరల పెరుగుదలను అరికట్టడంలో విల్సన్ ప్రభుత్వం విఫలమయ్యిందని భావిస్తున్నదనీ లేబర్ పార్టీ ఛైర్మన్ జాక్ జోన్స్ యాడ్ విన్న కార్మిక మహాసభలో ప్రసంగిస్తూ విమర్శించారు. అధికాధికంగా ప్రజల కడుపులుగొట్టే ప్రణాళికా విధానం అక్కర లేదని ఆయన అన్నారు.

ధరల పెరుగుదలను అరికట్టానికి యుద్ధకాలచర్యలనుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరలు పెరుగుతుంటే కార్మికుల వేతనాలు పెరగకుండా ఆంక్షలు పెట్టడం దారుణమనీ. ప్రస్తుతం దేశంలో 5 లక్షలమంది నిరుద్యోగులున్నారంటే, జాతీయ శక్తి ఎంత వృధా అవుతుందో గుర్తించటం అవసరమని హెచ్చరించారు.

లేబర్‌పార్టీ చైర్మన్‌తోపాటు. ఇంతకాలం విల్సన్ ప్రభుత్వ విధానాలను బలపర్చుతున్న అనేక కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వ ఆర్థిక విధానాలను దుమ్మెత్తారు

బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మహాసభ ప్రారంభంలో ప్రసంగిస్తూ విల్సన్ ప్రభుత్వం పొదుపు చర్యలు ఎగుమతుల్ని పెంచటంలో విఫలమయినాయని చెప్పారు.

ఒరిస్సా మంత్రివర్గ విస్తరణ

భువనేశ్వర్, సెప్టెంబరు 6

ఒరిస్సా మంత్రివర్గాన్ని విస్తరింపచేస్తూ నేడిక్కడ అధికార రీత్యా ప్రకటించారు. ఈ విస్తరణతో మంత్రివర్గ సభ్యుల సంఖ్య [illegible] నుంచి [illegible] కి పెరిగింది.

దక్షిణ అరేబియా జాతీయసంఘటనను బ్రిటన్ గుర్తింపు

ఏడెన్, సెప్టెంబరు 5

దక్షిణ అరేబియా సమాఖ్యలో షేక్‌ల రాజ్యాన్ని కూలద్రోసిన జాతీయ విమోచన సంఘటనను గుర్తించడానికి బ్రిటన్ నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

సభలు- సమావేశాలు

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కౌన్సిల్ సభ్యులు శ్రీ తోకల రాజయ్య ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నారు.

వరంగలు తాలూకా ధర్మసాగరం గ్రామంలో 7.9.67 రాత్రి 8 గంటలకు బహిరంగసభ జరుగును.

సభలో అదనపు శిస్తు ప్రతిఘటన పోరాటం ప్రజల కర్తవ్యం గురించి రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వై. వి. కృష్ణారావుగారు ఉపన్యసిస్తారు. కావున ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను.

ఉత్తర వియత్నాంలో 200 మిస్సిలీ ప్రయోగ కేంద్రాలు

వాషింగ్టన్, సెప్టెంబరు 6

ఉత్తర వియత్నాంలో ఇప్పుడు 200 లకు పైగా మిస్సిలీ ప్రయోగ కేంద్రాలు కలవని అమెరికన్ యుద్ధకార్యాలయం అంచనా వేస్తున్నది.

సోవియట్ నిర్మించిన ఈ 200 మిస్సిలీల ప్రయోగ కేంద్రాల నుంచి ఏ సమయంలో నైనా అమెరికన్ యుద్ధ విమానాలపై 350 మొదలు 500 మిస్సిలీల వరకు ప్రయోగించవచ్చునని తెలుస్తున్నది

హైఫాంగ్‌పై మూడు విమానాలు కూల్చివేత

హనోయ్, సెప్టెంబరు 5

హైఫాంగ్‌పై నిన్న ఉత్తర వియత్నాం [illegible] మూడు అమెరికన్ విమానాలను కూల్చివేశాయి.

వియత్నాం తీర రక్షణ దళాలు సెప్టెంబరు 1 ఫిరంగి కాల్పులు జరిపి ఒక అమెరికా ఓడకు నష్టం కలిగించాయి.

అమెరికా సైన్యాలతో వియత్‌కాంగ్ దళాల భీకర పోరాటం

దానాంగ్‌కు దక్షిణంగా 30 మైళ్ళలో వున్న పంట పొలాలలో అమెరికా సైనికులకు - వియత్‌కాంగ్ దళాలకు జరిగిన భీకర పోరాటంలో 54 మంది అమెరికన్లు చనిపోయారనీ 116 మంది గెరిల్లాలు హతులయ్యారని అమెరికా సైనికకార్యాలయం ప్రకటించింది.

అమెరికా సైన్యాలు టాంకులు, ఫిరంగులు, విమానాలను ఈ దాడిలో ఉపయోగించాయి అమెరికా సైన్యాలతో గెరిల్లాలు 6 గంటలు హోరాహోరీ పోరాడారు.

రైతు సదస్సు

(1 వ పేజీ తరువాయి)

కొనసాగించవలసిందిగా శ్రీ కృష్ణారావు రైతులకు విజ్ఞప్తిచేశారు.

శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు ప్రసంగం

తర్వాత కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు ప్రసంగిస్తూ యీ బిల్లువల్ల, కరీంనగర్ జిల్లాలోని మాగాణి ప్రాంతాలపై రేట్లు, 1962 అదనపు భూమిశిస్తు చట్టంకంటే, అధికం కాగలవని చెప్పారు.

ఈ నెల 11 నుండి 18 వరకూ అన్ని తాలూకాలలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు ప్రదర్శనలు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

యస్. యస్. పి, నాయకులు శ్రీ రామగోపాలరెడ్డి, శ్రీ జగదీష్ చంద్రరావు (జనసంఘ) యస్ వెంకటరెడ్డి పి.లింగారెడ్డి ఖాజామొహియుద్దీన్. ముకుందరెడ్డి ప్రసంగించారు.

12 మంది ప్రముఖులతో జిల్లా కార్యాచరణ కమిటీని దానికి కన్వీనర్‌గా శ్రీ చొక్కారావును ఎన్నిక చేశారు. కమిటీలోని సభ్యుల పేర్లు యివి.

శ్రీయుతులు పి. చొక్కారావు (కన్వీనరు కమ్యూనిస్టు). వి. ముకుందరెడ్డి (యస్. యస్. పి.) సి. హెచ్. రాజేశ్వరరావు (కమ్యూనిస్టు). జగదీష్ చంద్రరావు (జనసంఘ). ఎ. గోపాలరెడ్డి (మార్క్సిస్టు). వెంకటరావు (యస్. యస్. పి). లక్ష్మీనారాయణ (కమ్యూనిస్టు). టి. వెంకటరావు (రైతుసంఘం) నరసింహారెడ్డి (యస్.యస్ పి). ఆచారి (యస్. యస్. పి.). యల్. లింగారెడ్డి(ఇండి). రామగోపాలరెడ్డి(ఇండి).

సభను ముగిస్తూ శ్రీ వై. యల్లారెడ్డి ప్రసంగిస్తూ తమ లక్ష్యాలను సాధించుకొనడానికి అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవలసిందిగా రైతులకు విజ్ఞప్తిచేశారు.

ఈజిప్టుకు చైనా చేసిన వాగ్దానం ఉపసంహరణ

అరబ్ శిఖరాగ్రసభ నిర్ణయాలు తగినంత విప్లవకరంగా లేవని సాకు

కైరో, సెప్టెంబరు 5

ఐక్య అరబ్ రిపబ్లిక్‌కు చైనా వాగ్దానం చేసిన ఆర్థిక సహాయాన్ని. ఋణాన్ని ఇప్పుడు పెకింగ్ ప్రభుత్వం ఉపసంహరించుకొన్నట్లు తెలుస్తున్నది.

ఇటీవల [illegible] యుద్ధం జరిగిన వెనువెంటనే, చైనా ప్రభుత్వం ఈజిప్టుకు 1 50 000 టన్నుల గోధుమను ఉచితంగా సరఫరా చేస్తాననీ, కోటి స్టెర్లింగ్‌ల ఋణం యిస్తానని వాగ్దానం చేసింది.

మూడు రోజుల క్రితం కైరోలోని చైనా రాయబారి క్వాంగ్‌హా ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారులను కలుసుకొని, ఇటీవల ఖార్టూమ్‌లో జరిగిన అరబ్ శిఖరాగ్రసభ చర్యలు తగినంత విప్లవకరంగా లేవనీ, తాను చేసిన సహాయవాగ్దానాన్ని చైనాప్రభుత్వం ఉపసంహరించుకొంటున్నదని తెలియజేశారట

మండపేట మున్సిపాలిటీకి 5 గురు కమ్యూనిస్టులు ఏకగ్రీవంగా ఎన్నిక

[illegible], సెప్టెంబరు 6

తూర్పుగోదావరిజిల్లా మండపేట మున్సిపల్ ఎన్నికలలో మాజీ శాసన సభ్యుడు శ్రీ పాలచర్ల పనసరామన్నతో సహా 5 గురు కమ్యూనిస్టు అభ్యర్థులు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనారు

ఈ మున్సిపాలిటీలో 20 సీట్లకు 69 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 4 వ తేదీన 42 మంది అభ్యర్థులు ఉపసంహరించుకొనడంతో 14 సీట్లకు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు ముగిశాయి. వీటిలో 5 సీటలో కమ్యూనిస్టు అభ్యర్థులు ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారిలో పురపాలక సంఘ మాజీ చైర్మన్ శ్రీ వెగుళ్ళ వీర్రాజు సైతం వున్నారు.

పోటీలేకుండా ఎన్నికయినవారి పేర్లు యివి :

శ్రీయుతులు కొండేపూడి పనసయ్య. వేగళ్ళ వీర్రాజు. కొమ్ము సత్యం (కమ్యూ) మేర్ల వెంకట్రాజు. సిద్ధిరెడ్డి వెంకట్రావు. పాలచర్ల పనసరామన్న (కమ్యూ) జనసనోళ్ల సత్యం, వల్లూరి రామస్వామి. బోగిళ్ళ విశ్వనాథం, దిక్కాల తాతబ్బాయి (కమ్యూ). మండాది నారాయణమ్మ, గోసాడ అప్పలస్వామి (కమ్యూ), యిమ్మంది వెంకట్రావు. గండి పనసరామన్న (కమ్యూ).

మిగతా ఆరు స్థానాలకు పోటీలు జరుగుతాయి.

నోటీసు

నల్గొండ సబార్డినేట్ జడ్జికోర్టులో

9-A - O - 100/1967 లో

op- NO. 10/1966

పిటీషనరు: మహముదావి వగైరా,

V/s

రెస్పాండెంట్లు: 1. జైనబీ - నివాసం సంస్థాన్ నారాయణపురం.
2. కుద్సుంబీ - నివాసం సంస్థాన్ నారాయణపురం.
3. మౌలాబీ - నివాసం, చిమిరియాల,
4. జోహరబీ - వగైరా నివాసం - అక్కినేపల్లి,

పై కేసు ఒకటవ రెస్పాండెంటు చనిపోయిన సందర్భంలో ఆమె వారసులకు హాజరీగురించి కోర్టువారు తేదీ 19-9-1967 నాటికి వాయిదా వేశారు. పైన వ్రాసిన రెస్పాండెంట్లు నెం 2,3,4 వీరు పై తేదీన ఉ. గంll 10-30 లకు హాజరు కావలయును. లేని యెడల వారి పరోక్షములో కోర్టువారిచే తీర్పు యివ్వబడును.

ఇట్లు

పి రాఘవ రంగారావు

పిటీషనరు అడ్వకేటు. నల్గొండ

శ్రీ చాగ్లా రాజీనామా ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5

విదేశాంగ వ్యవహారాలమంత్రి శ్రీ ఎం.సి. చాగ్లా కేంద్ర మంత్రివర్గానికి సమర్పించిన రాజీనామాను ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ఆమోదించారు.

ముస్తాబాద గ్రామ పంచాయతీ

టెండరు నోటీసు

No. 2/67 — 68.

కృష్ణాజిల్లా - గన్నవరం తాలూకా, ముస్తాబాద గ్రామ పంచాయతీలో యీ దిగువ పనులు చేయుటకుగాను 15—9—1967 వ తేదీ శుక్రవారం సాయంత్రం 3 గంటల వరకు యీ క్రింది సంతకముచేసినవారిచే గాని, వారివలన అధికారము పొందినవారిచే గాని సీల్డు టెండరులు తీసుకొనబడును. అదే రోజు సాయంత్రము 4 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షమున తెరవబడును నిర్ణయించిన టెండరు డిపాజిట్టు చెల్లించి రశీదు టెండరుతో జతపరచవలయును. ఇతర వివరములు ఆఫీసు పనిచేయు వేళలందు తెలుసుకొనవలయును.

వరుస నెంబరు	పని వివరము	ఎస్టిమేషన్ విలువ రూ.	చెల్లించవలసిన డిపాజిట్ రూ.
1.	శ్రీ వాలకుగు నాగభూషణంగారి వీధిలో కల్వర్టు నిర్మాణము	3,250.00	162.50
2.	పేట హరిజనవాడలో బాలయ్య నూతి వద్ద నుండి చర్చి గుడివరకు రిటెయినింగు గోడల నిర్మాణము	4,200.00	210.00

(సం.) అబ్దుల్ జలీల్ ఖాన్,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు,
గ్రామ పంచాయితీ - ముస్తాబాద.
గన్నవరం తాలూకా - కృష్ణాజిల్లా.

తిరుమల - తిరుపతి దేవస్థానములు, తిరుపతి

టెండరు నోటీసు

R. O. C. No. Adv: XXXIX / EE / 67. Dt. 1—9—1967.

దిగువ తెలియపర్చబడిన పనులకు సీలువేసిన టెండర్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, తిరుమల - తిరుపతి దేవస్థానములు, తిరుపతి వారిచే కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లకు, టెండరు డాక్యుమెంటు ఖరీదు మనీ ఆర్డరు ద్వారా గాని. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి. లేదా ఆంధ్ర బ్యాంక్ తిరుపతి పై తీసుకొన్న చలాను దరఖాస్తుతో పాటు పంపి పొందవచ్చును. దరఖాస్తులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గారికి 20—9—1967 తేదీ నాటికి అందునట్లు పంపవలయును. అయిటం నెం. 1 కు దరఖాస్తులు 27—9—67 తేదీ సాయంత్రం 3.00 గంటలవరకు తీసుకొనబడును. ఏ కారణం చూపకనే ఏ టెండరునైనా అంగీకరించుట, లేదా అన్ని టెండర్లను నిరాకరించు అధికారము టెండరు ఆమోదించు అధికారులకు కలదు.

వరుస నెంబరు	పని పేరు	పని విలువ రూ.	ఎర్నెస్టు మనీ డిపాజిట్ రూ.	పూర్తి చేయు టైము	టెండరు డాక్యుమెంటు ఖరీదు రూ.
1.	టి. ఆర్. నెం. 72 రామనాథ్ జిల్లా రామేశ్వరంవద్ద టి. టి. డి. ధర్మశాల నిర్మాణము చేయుట	2.56,000/-	6 400/.	18 నెలలు	10/-
2.	టి. ఆర్. నెం. 73 తిరుమలలో స్టాఫ్ క్వార్టర్సు బ్లాక్ నెం. 1 నిర్మాణం చేయుట	1,95,90[illegible]/.	4.900/.	1 సంllరం	10/.
3.	టి. ఆర్. నెం. 74 తిరుమలలో స్టాఫ్ క్వార్టర్సు బ్లాక్ నెం. 2 నిర్మాణము చేయుట	1,95,900/.	4,900/-	..	10/
4.	టి. ఆర్. నెం. 75 తిరుమలలో స్టాఫ్ క్వార్టర్సు బ్లాక్ నెం. 3 నిర్మాణము చేయుట	1,95,900/.	4,900/.	..	10/-
5.	టి. ఆర్. నెం. 76 తిరుమలలో స్టాఫ్ క్వార్టర్సు బ్లాక్ నెం. 4 నిర్మాణము చేయుట	1,95,900/.	4 900/.	..	10/.

(సం.) యస్. చెంద్ రాజు,
(ఫర్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు.

జాయ్ మీ ఊరొచ్చిందండోయ్

బహు శ్రేష్ఠమైన ఐస్‌క్రీములు ప్రతిదినం మీ కోసం

బొంబాయి, బెంగుళూరు నుండి విమానం మీద రవాణా

జాయ్, ఊరూర జనాన్ని నోరూరించి, యిప్పుడు మీ కుటుంబ, మిత్రసమేతంగా మిమ్మానందింప జేయవచ్చింది.

శుద్ధమైన, ఆరోగ్యమైన పాలతో, పుష్టికరమైన అంశాలను కలిపి తయారు చేయబడిన ఒక్కొక్క రకమైన జాయ్‌లోను మీ విత్తమునకు దగిన అత్యుత్తమ విలువ దొరుకుతుంది. గుర్తుంచుకోండి. ఎంచుకోడానికి 63 జాయ్ రకాలున్నాయి! లక్షలాది జనులతో మీరూ జిల్లుమనే దాని చల్లని ఆనందాన్ని పంచుకోండి — జాయ్ ఐస్‌క్రీములు ఈ రోజే కొని రుచి చూడండి!

JOY

జాయ్ ఐస్ క్రీమ్స్

హోటళ్లకు, వివాహాలకు, [illegible], కాలేజీలలో పార్టీలకు కావాలంటే, హైదరాబాదు, సికిందరాబాదులలో జాయ్ డిస్ట్రిబ్యూటర్లను కలుసుకోండి. అడ్రసు :

మెసర్స్

లక్కీ ట్రేడర్స్

నయా పూల్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 44737/51327



NAS 63844

కల్తీ వ్యాపారం ఒక 'ప్రత్యేక కళ'

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 — భారత దేశంలో ఆహార పదార్థాలను కల్తీ చేయడం 'ప్రత్యేక కళ'గా అభివృద్ధి చెందినదని, ఇది భారతదేశ విశిష్టత అని కేంద్ర ఆరోగ్యశాఖ ఉపమంత్రి శ్రీ బి.ఎస్. మూర్తి నేడిక్కడ ఆహార ప్రమాణాల కేంద్ర కమిటీ 13వ సమావేశాన్ని ప్రారంభిస్తూ వ్యాఖ్యానించారు.

కొన్ని రాష్ట్రాలలో కల్తీ వ్యాపారం తీవ్రమైన స్థాయికి చేరినదని, దీనిని కేంద్ర ప్రభుత్వం అరికట్టలేకపోతున్నదని ఆయన అంగీకరించారు.


4 వ వారం
విజయవాడ: శేష్‌మహల్
గుంటూరు: నాజ్‌లిటిల్‌బ్రిగ్ (A.C)
వైజాగ్: రామకృష్ణాపిక్చర్‌ప్యాలెస్
ఈవారంనుండి ఎక్స్‌పో 67 కెనడా రీలు కలపడమయినది!
పచ్చి సమర్పించు
ప్రప్రథమ భారతీయ 70mm & 35mm ఈస్ట్‌మన్‌కలర్‌చిత్రం
ఎరౌండ్ ది వరల్డ్
డైరెక్షన్. పచ్చి ● మ్యూజిక్. శంకర్‌జైకిషన్ ● ఆంధ్ర. వెరైటీ రిలీజ్ ఓ.జె. వెంకటనారాయణ
NAVRANG


నేడే చూడండి!
మ్యాటినీలో
విజయవాడ. రాజకుమారి
గుంటూరు. శ్రీకృష్ణాపిక్చర్ ప్యాలెస్
రాజమండ్రి. మినర్వా
మాలాసిన్హా. బిశ్వజిత్ సుజితకుమార్. నిరూపరాయ్ హెలెన్. జానీవాకర్
డైరెక్షన్ మోని భట్టాచార్య
మ్యూజిక్ లక్ష్మీకాంత్‌ప్యారేలాల్
ఈస్ట్‌మన్ కలర్... పెద్దలకుమాత్రమే!
A
విజయసారథి రిలీజ్

ఆంధ్రపై కేరళ విజయం

5వ పెంటాంగ్యులర్ ఫుట్‌బాల్ పోటీలలో

కొలంబో, సెప్టెంబరు 5 — కొలంబో సుగదాస స్టేడియంలో నేడు ప్రారంభమైన 5వ దక్షిణ పెంటాంగ్యులర్ ఫుట్‌బాల్ పోటీలలో ఇదివరకటి ఛాంపియన్లు అయిన ఆంధ్రజట్టును కేరళ జట్టు 5-2 గోలుల తేడాతో ఓడించింది. ఆట సగానికి కేరళజట్టు 1-0 గోలుతో ఆంధ్రకన్న ముందంజగా వుంది. ఆటరెండవ భాగం మొదలుపెట్టిన కొద్ది సేపటిలోనే కేరళజట్టు మరొకగోలుచేసింది. ఈ గోలు సెంటర్ ఫార్వర్డ్ ఆటగాడు చెరియన్ చేశాడు. 3 నిముషాల తరువాత శ్రీనివాసన్, రామకృష్ణన్, మొహిదీన్ కుట్టిల సహాయంతో కేరళకు మరొకగోల్ సాధించాడు.

ఆంధ్రకు, ఇన్‌సైడ్-లెఫ్ట్ ఆటగాడు జఫార్ ఒకగోలుచేసి స్కోరును 3-1 చేశాడు. కాని వెంటనే రెండు గోలులుచేసి కేరళ స్కోరును 5-1 చేసింది. గోపాలకృష్ణన్, సెంటర్-ఫార్వర్డ్ చెరియన్ ఈ గోలులు చేశారు.

ఆంధ్రకు చెందిన అజామ్ ఆటముగిసే సమయానికి ముందుగా ఒకగోలు చేశాడు. చివరకు 5-2 గోలుల కేరళ విజయంతో ఆట ముగిసింది. కేరళ జట్టుకు కెప్టెన్ గోపాలకృష్ణన్. ఆంధ్ర జట్టుకు కెప్టెన్ నయీమ్.

రేపు మద్రాసు జట్టుతో సిలోన్ జట్టు ఆడుతుంది.

నేడే చూడండి
నవరంగ్ - విజయవాడ
సరస్వతి - వైజాగ్
ఉదయం ఆటతో ప్రారంభం

O. S. S. 117
టెర్రర్-ఇన్-టోక్యో
(ఈస్ట్‌మన్ కలర్ చిత్రం)
ఫ్రెడరిక్ స్టాఫర్డ్ —
హోవర్డ్ వానెసర్ డిలాబర్
ఇనా —మరీనా వ్లడీ
ప్రొడ్యూసర్ —ఎండ్రే హునెబెల్లి
డైరెక్టర్ —మిచెల్‌బోయ్సంద్
ఆంధ్ర పంపిణి:
విజయా పిక్చర్సు. విజయవాడ. గుంటూరు
Vijaya

స్త్రీల హాకీజట్టుకు ఎలెవెరా బ్రిట్టో నాయకత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5 — రేపు ఢిల్లీ లేడీ హార్డింజ్ ఆవరణలో ఆస్ట్రేలియా స్త్రీల జట్టుతో భారతస్త్రీల జట్టుకు జరగబోయే ఏకైక 'టెస్ట్' పోటీలో పాల్గొనబోయే భారత స్త్రీలజట్టుకు మైసూరుకు చెందిన ఎలెవెరా బ్రిట్టో నాయకత్వం వహిస్తారు. మిగతా జట్టును అఖిల భారత స్త్రీల హాకీ సంఘం వారు సూచించిన 22 మంది నుండి ఎన్నిక చేస్తారు.

సెప్టెంబరు 17నుండి విజయవాడలో క్రికెట్ పోటీలు

విజయవాడ, సెప్టెంబరు 5 — విజయవాడ పట్టణ క్రికెట్‌లీగ్ పోటీలు సెప్టెంబరు 17 నుండి ఇక్కడ ప్రారంభం అవుతాయి. పోటీ చేయదలచినవారు సెప్టెంబరు 12 లోపుగా డి. వెంకటేశ్వరరావు, పోస్టుబాక్సు నంబరు 44 విజయవాడ అడ్రసుకు తమ దరఖాస్తులను పంపాలి.

ఈ సంవత్సరపు ఆఫీసు బేరర్లుగా వి. ఆర్. పటేల్ (అధ్యక్షుడు) డి. వెంకటేశ్వరరావు (కార్యదర్శి), ఎమ్. హెఫీ (కోశాధికారి) తదితరులు నియమింపబడ్డారు.

మెర్డెకాలో భారత పరాజయ కారణాలు

ఎ. ఐ. ఎఫ్. కార్యదర్శి శ్రీ విట్టల్ వివరణ

మద్రాసు, సెప్టెంబరు 5 — మలేషియాలో జరిగిన మెర్డెకా ఫుట్‌బాల్ పోటీలలో భారతదేశజట్టును గురించిన తన అభిప్రాయాలను ఆ జట్టుకు మానేజర్‌గా వ్యవహరించిన శ్రీ ఎస్. విట్టల్ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' విలేకరి జరిపిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ఆసియా ఫుట్‌బాల్‌లో భారతదేశం, ఒకస్థానాన్ని సంపాదించాలంటే జట్టు ఫార్వర్డు లైన్ ఎన్నికలో కొన్ని ముఖ్యమైన మార్పులు రావాలని" అన్నారు. భారతజట్టు డిఫెన్సును ఆయన ప్రశంసించారు. పశ్చిమ జర్మనీ కోచ్ శ్రీ డి. క్రామర్ భారతజట్టు డిఫెన్సు, మలేషియా ఫార్వర్డు లైనులు గనక కలిసి ఒక జట్టుగా ఏర్పడి ఆడితే మెర్డెకా టైటిల్ తేలికగా దక్కేదని తనతో అన్నారని శ్రీ విటల్ అన్నారు. చాలామంది ఆసియా ఫుట్‌బాల్ నిపుణుల అభిప్రాయంకూడా ఇదేనని ఆయన అన్నారు. ఫార్వర్డ్‌లైన్ ఆటగాళ్ళు గోల్‌ను తమ లక్ష్యంగా పెట్టుకుని చొరవతో ఆడాలని ఆయన అన్నారు. ఇండియా ఫార్వర్డ్సులో ఇందర్‌సింగ్, అశోక్‌చటర్జీలు తప్ప మిగతా వాళ్ళు బాగా ఆడలేదనీ, మొహిదీన్‌కుట్టీ గనక టీములో వున్నట్లయితే జట్టు పరిస్థితి చాలా మెరుగయ్యేదనీ ఆయన అన్నారు.

భారత జట్టు చివరకు జరిగిన పోటీలలో డిఫెన్సు ఆటగాడు కెప్టెన్ అయిన జర్నైల్‌సింగ్, ఫార్వర్డు ఆటగాడు ఇందర్ సింగులు గాయపడటంతో గట్టిచిక్కును ఎదుర్కోవలసి వచ్చింది దక్షిణ వియత్నాంలో జరిగిన ఒక ఆటలో రిఫరీ విచిత్రమైన కారణాలతో దక్షిణ వియత్నాంకు 'పెనాల్టీ కార్నర్'ను ఇచ్చాడు. ఇలా ఎందుకు ఇచ్చాడో ఇంతవరకు రహస్యంగానే వుండిపోయింది. కలకత్తా ఫుట్‌బాల్ సీజన్, మెర్డెకా ఫుట్‌బాల్ పోటీలురెండూ ఒకేసారి, ఆగష్టులో వస్తున్నందువల్ల జట్టుకు మంచిశిక్షణ ఇవ్వటానికి అవకాశం లేకపోతున్నది. ఆటగాళ్ళకు కలకత్తాగాక వేరేచోట శిక్షణ ఇవ్వటం వల్ల పై లోపాన్ని సవరించవచ్చును. దేశంలో మంచి ఆటగాళ్ళకు కొరత లేదనీ, సెలక్షన్‌తోనే పేచీ వస్తున్నదనీ, ఇకముందు సెలక్షన్లు నిష్పక్షపాతంగా మంచి ఆటగాళ్ళనే సెలక్టు చెయ్యాలనీ ఆయన అన్నారు.

ఆదాయపు పన్ను రెండుసార్లు విధింపబడకుండా బెల్జియమ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకోవటానికి ఆర్థికశాఖ రెవెన్యూ, ఖర్చుల కార్యదర్శి శ్రీ టి. పి. సింగ్ సెప్టెంబరు 6 ఉదయం బ్రస్సెల్స్ బయలుదేరారు.

అసన్‌సోల్‌లో కర్ఫ్యూ

అసన్‌సోల్, సెప్టెంబరు 5 — బస్ కండక్టర్లు, డ్రైవర్లకు, కొంతమంది విద్యార్థులకు మధ్య ప్రారంభమయిన ఘర్షణలు తీవ్ర రూపం ధరించటంతో అసన్‌సోల్‌లో రాత్రి 8 గంటలనుంచి కర్ఫ్యూ అమలు జరుపుతున్నారు. పట్టణంలో 144 వ సెక్షన్ కూడా అమలులో వుంది. విద్యార్థుల్ని చెదరగొట్టటానికి పోలీసులు బాష్పవాయు ప్రయోగంకూడా జరిపారు.

10 మంది పోలీసులతో సహా మొత్తం 30 మంది ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. బి. ఎస్. టి. యు. సి అనుబంధ సంస్థ కండక్టర్ల డ్రైవర్ల యూనియన్ కార్యదర్శిని పోలీసులు ఈ ఘర్షణల సందర్భంలో అరెస్టు చేశారు.

లెనిన్‌గ్రాడ్ గోష్ఠిలో ఆంధ్ర ఇంజనీర్

హైదరాబాద్, సెప్టెంబరు 5 — 1967 ఆగష్టు మూడవవారంలో సోవియట్ యూనియన్‌లోని లెనిన్‌గ్రాడ్‌లో యునెస్కో ఆధ్వర్యంలో "వరదల సూచన అంచనాలు" అన్న అంశంపై ఏర్పాటు చేయబడిన గోష్ఠిలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్సుశాఖ అదనపు కార్యదర్శి శ్రీ జి. ఎ. నరసింహారావుపాల్గొన్నారు. రానున్న వరదల స్థాయిని లెక్కకట్టే పద్ధతిని గురించి ఆయన ఆ గోష్ఠికి ఒక పత్రం సమర్పించారు.

మా ప్రథమ వార్షికోత్సవ సందర్భమున మాతో సహకరించి, ప్రోత్సహించిన శ్రేయోభిలాషులకు, సవినయముగా అర్పించు కృతజ్ఞతాభివందనములతో
నూతన షోరూమ్
ది 7—9—1967 న
ప్రారంభించుచున్నామని తెలుపుటకు సంతోషించుచున్నాము.
పద్మా ఏజన్సీస్
మెయిన్‌రోడ్డు :: విశాఖపట్నం-2
Navin

మ్యాటినీలతో
సెప్టెంబర్ 14 విడుదల!
వాసుదేవా ఫిలిమ్స్ సమర్పించు బాలన్ పిక్చర్స్ వారి
ముగ్గురు మిత్రులు
దర్శకత్వం: జంబు • నిర్మాతలు: విక్రమ్‌సింహా & కృష్ణ
సంగీతం: S.M.S. & బాబురావు • కూర్పు: వేలూరి అంకిరెడ్డి
శ్రీలక్ష్మి నారాయణ పిక్చర్స్ రిలీజ్.



విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. ప్రధాన సంపాదకులు : ఏటుకూరి బలరామమూర్తి, ముద్రణ : స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4.